



రైల్వే అధికారులు స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్లు

గంజాయి చాక్లెట్లు!

రూటు మార్చిన కేటుగాళ్లు

- చాక్లెట్ రూపంలో తయారు చేసి తరలింపు
- గతంలో నూనె, పొడిగా, తెల్లటి క్రీమ్‌గా చేసి సరఫరా
- పోలీసుల కళ్లు గప్పి కొరియర్ ద్వారా అక్రమ రవాణా
- స్కూల్, కాలేజీ విద్యార్థులే లక్ష్యంగా వ్యాపారం

నగరాలు, పట్టణాలు, పల్లెల్లో మత్తుకు పెరుగుతున్న డిమాండ్ గంజాయి అక్రమ రవాణాను కొత్త పుంతలు తొక్కిస్తోంది. స్మగ్లర్లు ఎప్పటికప్పుడు వారి మెదడుకు పదును పెడుతూ పోలీస్ శాఖకు సవాల్ విసురుతున్నారు. పోలీసులు నిత్యం తనిఖీలు నిర్వహిస్తూ, గంజాయిని గుర్తించేందుకు రోడ్లపై సెన్సార్‌లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో నిఘా ఉంచినా ఆంధ్రా-ఒరిస్సా సరిహద్దు(ఏవోబీ) నుంచి ప్రయాణం కొనసాగు తూనే ఉంది. దీని కోసం స్మగ్లర్లు గంజాయికి రోజుకో కొత్త రూపాన్ని ఇచ్చి నిర్భయంగా క్షేత్ర స్థాయికి చేరవేస్తూనే ఉన్నారు.

(ఆంధ్రజ్యోతి విజయవాడ సిటీ): ఐదేళ్ల క్రితం ఏవోబీ నుంచి గంజాయి ఆకులను కూరగాయల బుట్టల్లోనూ, వస్తు సామగ్రి మధ్యలోనూ, ఆయిల్ ట్యాంకర్‌లలోనూ, దేవుడు పటాల వెనుక ఉంచి స్మగ్లింగ్ చేశారు. ఆ తర్వాత వాసన బయటకు రాకుండా ఆకర్షణీయమైన ప్యాకెట్లలోకి గంజాయిని చేర్చారు. నాలుగేళ్ల క్రితం ప్లాస్టిక్ వేజలైన్ డబ్బాల్లోకి.. వేజలైన్ రూపంలోనే తెల్లగా ఉండేలా తయారు చేసి కేసరపల్లి వద్ద పట్టుబడ్డారు. మూడేళ్ల క్రితం గంజాయి ఆకులను లిక్విడ్‌గా మార్చి కొబ్బరి నూనె సీసాల్లో పోసి రవాణా చేశారు. ఆ తర్వాత పొడులుగా మార్చారు. ప్రస్తుతం గంజాయికి చాక్లెట్ రూపాన్ని ఇచ్చి అందమైన ప్యాకెట్‌లోకి చేర్చారు. ఈ చాక్లెట్‌లకు అందమైన డిజైన్ ఇవ్వడంతో పాటు చార్మినార్ గోల్డ్ వంటి బ్రాండెడ్ కంపెనీ పేరును చాక్లెట్ ప్యాకెట్‌కు అతికించారు.

అక్రమ రవాణాకు కొరియర్ సర్వీసులు

వాహనం సీజ్, జైలు శిక్ష నుంచి తప్పించుకునేందుకు కొరియర్ మార్గాన్ని ఎంచుకుని అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్న ఉదంతాలు ఇటీవల కాలంలో అనేకం వెలుగు చూశాయి. కొరియర్ సంస్థలకు పాడుబడి, ఎవరూ ఉండని ఇళ్ల అడ్రస్‌లను ఇచ్చి రవాణా చేస్తున్నారు. ఇదే వ్యవహారాన్ని గతంలో విజయవాడ పోలీసులు బహిర్గతం చేశారు. కొన్ని ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలను సైతం కేటుగాళ్లు కేసుల్లో ఇరికించిన మిగతా 6లో..

రైల్లో గంజాయి చాక్లెట్ల స్వాధీనం 6



కోడూరు మండలం లింగన్నకోడు డ్రెయిన్‌లో మళ్లీ పెరిగిన కిక్కిస

కోటి ఆశలతో ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న అన్నదాతలను ముంపు భయం వెంటాడుతోంది. గతేడాది వచ్చిన బుడమేరు వరదలు, భారీ వర్షాల సమయంలో జిల్లాలోని ప్రధాన డ్రెయిన్లలో పారుదల సరిగా లేక పంట పొలాలు మునిగిపోయి పంటలను కోల్పోయారు. ఈ ఏడాది అటువంటి పరిస్థితి రాకుండా ఉండేందుకు ప్రభుత్వం రూ.7 కోట్ల నిధులు కేటాయించినా పూర్తిస్థాయిలో పనులు జరగలేదు. ఏ డ్రెయిన్ చూసినా గుర్రపు డెక్క, కిక్కిసతో నిండిపోయి ఉన్నాయి. ఈ ఏడాది కూడా భారీ వర్షాలు కురిస్తే పంటలు మునగడం ఖాయమని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- జిల్లాలో 1.62 లక్షల హెక్టార్లలో వరి సాగుకు సన్నద్ధం
- పూడిక తీతకు నోచుకోని ప్రధాన డ్రెయిన్లు
- గుండేరు, లింగన్నకోడు డ్రెయిన్లలో తొలగించినా మళ్లీ వచ్చిన కిక్కిస
- భారీ వర్షాలు కురిస్తే పంట పొలాలు మునగడం ఖాయమంటున్న రైతులు
- అధికారులు, కాంట్రాక్టర్ల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

రూ.7 కోట్లు మంజూరైనా పూర్తిస్థాయిలో జరగని పనులు

బుడమేరు వరదలు, భారీ వర్షాలు కురిసి పంట పొలాలు నీటమునిగిన ప్రాంతాల్లో ఈ ఏడాది ముంపు నుంచి పంట పొలాలను కాపాడేందుకు డ్రైనేజీల్లో కిక్కిసను తొలగించేందుకు రూ.7కోట్లతో అంచనాలు రూపొందిస్తే ప్రభుత్వం నిధులు కేటాయించింది. పామర్రు నియోజకవర్గంలోని ఐనంపూడి డ్రెయిన్, అవనిగడ్డ నియోజకవర్గంలోని రత్నకోడు, లింగన్నకోడు, గుండేరు డ్రెయిన్‌లలో పనులు చేసేందుకు మేలోనే కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. కాంట్రాక్టర్లు ఈ పనులకు 40 శాతం తక్కువగా టెండరు వేసి పనులు దక్కించుకున్నారు. అధికారులకు కమీషన్‌లు, కాంట్రాక్టర్ల లాభాల రూపంలో 20శాతం మినహాయిస్తే 40శాతం నిధులతోనే పనులు చేయాల్సి వచ్చింది. జూన్, జూలై నెలల్లో వర్షాలు పడకపోవడంతో కొంతమేర పనులు చేశారు.

ముంపు భయం!

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: ఖరీఫ్‌లో జిల్లావ్యాప్తంగా 1.62 లక్షల హెక్టార్లలో వరి సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. గత జూన్, జూలై నెలల్లో పూర్తిస్థాయిలో వర్షాలు పడకపోవడంతో డ్రైనేజీల వలన పెద్దగా ఇబ్బంది రాలేదు. జూలై నుంచి డిసెంబరు మొదటి వారం వరకు వర్షాలు కురుస్తూనే ఉంటాయి. పంట చేతికొచ్చే సమయమైన నవంబరు, డిసెంబరు నెలల్లో వాయుగుండాలు ఏర్పడి భారీ వర్షాలు కురిస్తే పంట పొలాల్లోని నీరు త్వరితగతిన బయటకుపోదు. దీంతో పంట దెబ్బతినే అవకాశం ఉంది. గత నాలుగైదు సంవత్సరాలుగా నవంబరు, డిసెంబరు నెలల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా పంట నీట మునిగి రైతులు నష్టపోవడం ఆనవాయితీగా వస్తోంది. గతేడాది ఆగస్టులో బుడమేరుకు వరద పోటెత్తడంతో పొలాల్లోని వరిపైరు రోజుల తరబడి నీటిలోనే ఉండిపోయి చనిపోయింది. గతేడాది తలెత్తిన పరిస్థితులను చూసి, ఈ ఏడాది వేసవిలో డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేస్తారని రైతులు ఆశించినా పూర్తిస్థాయిలో పనులు జరగలేదు.

మళ్లీ బతికిన కిక్కిస..

అవనిగడ్డ నియోజకవర్గం కోడూరు మండలం లింగన్నకోడు డ్రెయిన్‌లో పెదగుడిమోటు-మోదుమూడి గ్రామాల మధ్య కిక్కిసను గత నెలలో తొలగించారు. ఈ పనులు సక్రమంగా చేయకపోవడంతో పూడిక తీసిన 15, 20 రోజుల వ్యవధిలోనే మళ్లీ కిక్కిస బతికి దట్టంగా పెరిగింది. ప్రస్తుతం మీటరు ఎత్తున కిక్కిస ఉంది. మొవ్వ మండలంలో కాజ వద్ద ప్రారంభమై ఘంటసాల మండలం జీలగలగండి సమీపంలో గుండేరు డ్రెయిన్‌లో కలిసే ఐనంపూడి డ్రెయిన్‌లో కిక్కిసను కొంతమేర తొలగించారు. డ్రైనేజీ గట్టు అంచునుంచి ప్రొక్లెయిన్ బకెట్ ఎంత దూరం అందితే, అంత దూరం వరకే పూడిక తీశారు. డ్రెయిన్ లోపల ఉన్న కిక్కిసను తొలగించలేదు. పూర్తిస్థాయిలో కిక్కిసను తొలగించకపోవడంతో అది మళ్లీ బతికి ఏపుగా పెరుగుతోంది. రైతులు దీనిపై అధికారులు, కాంట్రాక్టర్లను ప్రశ్నిస్తే, వర్షాలు బాగాపడిన తర్వాత, డ్రెయిన్‌లలో నీటిమట్టం పెరిగితే ఆ నీటిలో పంటును దించి దానిపై యంత్రాలు ఉంచి కిక్కిసను తొలగిస్తామని చెబుతున్నారు. అలా సాధ్యం కాకపోతే డ్రోన్‌ల ద్వారా రసాయనాలు పిచికారీ చేసి కిక్కిస చనిపోయేలా చేస్తామని పేర్కొనడం గమనార్హం. కిక్కిస రసాయనాల ప్రభావానికి చనిపోదని, పూర్తిస్థాయిలో వేరులతో సహా తీసి బయటపడవేస్తేనే చనిపోతుందని, అప్పుడు నీటి ప్రవాహానికి అడ్డు ఉండదని రైతులు అంటున్నారు. మొవ్వ మండలంలోని ఉప్పాయికోడు, భీమనది డ్రైనేజీలో ఈ ఏడాది పూడికతీత పనులు చేయలేదు.

పనులకు నోచుకోని శివగంగ, లంకపల్లి డ్రెయిన్‌లు

బందరు మండలంలోని శివగంగ, లంకపల్లి, తాళ్లపాలెం డ్రైనేజీల్లో ఈ ఏడాది అసలు పనులే చేయలేదు. మేలో కత్తెరపోట్లు వచ్చిన సమయంలో సముద్రపు నీరు నేరుగా డ్రెయిన్‌ల్లోకి వచ్చి గుర్రపు డెక్క, నాచు ఉప్పునీటి ప్రభావంతో చనిపోయేవి. ఈ ఏడాది మే చివరిలో వర్షాలు మిగతా 6లో..

అర్ధరాత్రి అక్రమాలు

- కొత్తూరు తాడేపల్లిలో పోలవరం మట్టి తవ్వకాలు
- ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారుల బృందం
- పారిపోయిన అక్రమార్కులు.. ఎక్స్‌కవేటర్ స్వాధీనం
- తోటలో మట్టి ఎంత తోలారో తెలుసుకోవటానికి వెళ్లిన జేఈఈ
- అధికారులు లోపల ఉండగానే గేటుకు తాళం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు

6లో



గురువారం అర్ధరాత్రి కొత్తూరు తాడేపల్లిలో పోలవరం మట్టి తవ్వకాలు

ప్రజాచైతన్యంలో మీడియా పాత్ర కీలకం

కలెక్టర్ డీకే బాలాజీ 8లో

కేసుల సత్వర పరిష్కారానికి మీడియేషన్ సెంటర్లు

» జిల్లా న్యాయాధికారి గోపి

అన్నదాతకు ఆర్థిక భరోసా

దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చోరీ నిందితులు దొరికారు

- రూ. 13.56 లక్షల విలువైన స్టాంప్ పేపర్లు స్వాధీనం

6లో



తుపాకులతో ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తున్న పోలీస్ అధికారులు

ఫైరింగ్ ప్రాక్టీస్

మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో జిల్లా స్థాయి పోలీస్ ఫైరింగ్ రేంజ్ శిబిరం శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ ఆర్.గంగాధరరావు ఫైరింగ్ ప్రక్రియపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఏకాగ్రతతో ప్రతి ఒక్క బుల్లెట్ లక్ష్యాన్ని ఛేదించేలా తర్ఫీదు పొందాలని సూచించారు. కొత్తగా వస్తున్న ఆయుధాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు.

-మచిలీపట్నం టౌన్-ఆంధ్రజ్యోతి



మంగినపూడి బీచ్‌లో ఫైరింగ్ రేంజ్ ప్రాక్టీస్‌ను పరిశీలించి సూచనలు చేస్తున్న ఎస్పీ గంగాధరరావు

పట్టిసీమ వెలుగులు



8

జిల్లాలో భారీ వర్షం

మచిలీపట్నం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా శుక్రవారం భారీ వర్షం కురిసింది. బలమైన గాలులు వీయడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మచిలీపట్నంలోని రహదారులపైకి భారీగా నీరు చేరింది. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా ఈ నెల 14వ తేదీ వరకు కోస్తాతీరం వెంబడి ఉరుములు, మెరుపులతో కూడిన ఒక మోస్తరు వర్షం కురుస్తుందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. మచిలీపట్నం, చల్లపల్లి, గుడివాడ, పెడన, బంటుమిల్లి, తదితర ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది.

వరి పంటకు జీవం

జిల్లాలో నాట్లు వేసే పద్ధతిలో, వెదజల్లే పద్ధతిలో 20 వేల హెక్టార్లలో వరి సాగు పూర్తయ్యింది. మరో 3వేల హెక్టార్లలో నారుమడులు పోశారు. శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షం వరినాట్లు పూర్తి చేసిన పొలాల్లోని వరిపైరుకు కొంతమేర జీవం పోసినట్లయిందని రైతులు అంటున్నారు. కాలువలకు శివారు ప్రాంతంలో ఉన్న అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో నారుమడులు పోసే పనిలో రైతులు ఉన్నారు. వాతావరణం చల్లబడి వ్యవసాయానికి అనుకూలంగా మారితే త్వరితగతిన ఎగువ ప్రాంతంలో వరినాట్లు వేగవంతమవుతాయని రైతులు చెబుతున్నారు. దీంతో కాలువ శివారు భూములకు సాగునీరు పుష్కలంగా విడుదల చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది.

జనం సొమ్ము మింగి జల్సాలు

- బయటపడుతున్న 'అద్విక' బాగోతాలు
- ఖరీదైన హోటళ్లలోనే ఆదిత్య బస
- ఖాతాదారులకు ముఖం చాటేసి విలాసాలు
- స్టార్ హోటల్‌లో నెలకు రూ.3 లక్షల బిల్లు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ): జనాలను నిండా ముంచేసి కూడా జల్సాలు బాగానే చేశాడు అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్ యజమాని తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్య. రూ.లక్షకు నెలకు రూ.6 వేల వడ్డీ చెల్లిస్తానని నమ్మించి వందలాది మందికి రూ.కోట్లు టోకరా వేసిన ఈయన.. స్టార్ హోటళ్లలో జల్సాలు చేసినట్టు పోలీసులు గుర్తించారు. నగరంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఓ స్టార్ హోటల్‌లో కొన్ని నెలలపాటు బస చేసినట్టు ఆధారాలు సేకరించారు.

స్టార్ హోటల్‌కు నెలకు రూ.3 లక్షల బిల్లు

ఏజెంట్లకు, ఖాతాదారులకు సక్రమంగా చెల్లింపులు చేసిన రోజుల్లో అద్విక కార్యాలయానికి నిత్యం వెళ్లిన ఆదిత్య చెల్లింపులు ఆగిపోయాక వెళ్లడమే మానేశాడు. ఆ తర్వాత స్టార్ హోటల్‌లో కొన్ని నెలలపాటు బస చేశాడు. అక్కడి నుంచి కార్యాలయంలో ఏం జరుగుతుందో సిబ్బందికి ఫోన్ చేసి తెలుసుకునేవాడు. ఇలా హోటల్‌లో బస చేసినందుకు నెలకు రూ.3 లక్షల బిల్లు చెల్లించినట్టు గుర్తించారు. ఈ డబ్బును ఖాతాదారుల పెట్టుబడుల నుంచే చెల్లించినట్టు తేల్చారు. ఈ హోటల్‌లో లగ్జరీ గదుల్లో కూర్చుని ట్రేడింగ్ చేస్తున్నట్టుగా చెప్పేవాడు. అద్విక కార్యాలయంలో పనిచేసే సిబ్బంది, ఏజెంట్లు ఇదంతా నిజమేనని విశ్వసించారు. వాస్తవానికి బకాయిల గురించి ఖాతాదారులు పదేపదే ఒత్తిడి చేస్తుండటంతో స్టార్ హోటల్‌లో కూర్చుని హాయిగా విశ్రాంతి తీసుకునేవాడు.

మేమే సెటిల్ చేసుకుంటాం : ఏజెంట్లు

అద్విక కంపెనీకి నగరంలోని ప్రైవేట్ బ్యాంకుల్లో ఏడు ఖాతాలు ఉన్నాయి. ఇవికాకుండా కంపెనీ ఎండీ ఆదిత్య, ఆయన సతీమణి సుజాత పేరుతో మరో ఐదు ఖాతాలు ఉన్నట్టు పోలీసులు నిర్ధారించారు. వాటిద్వారా జరిగిన లావాదేవీల వివరాలను సేకరించే పనిలో దర్యాప్తు బృందాలు ఉన్నాయి. అద్వికకు రెండు తెలుగు రాష్ట్రాల్లో 42 మంది ఏజెంట్లుగా వ్యవహరించారు. వాళ్లందరినీ పోలీసులు పిలిపించి విచారణ చేస్తున్నారు. ఏజెంట్లుగా వ్యవహరించిన వారు ఎంత మొత్తంలో పెట్టుబడి పెట్టారు, వారికి పరిచయం ఉన్న వ్యక్తుల ద్వారా ఎంత పెట్టుబడిని పెట్టించారు.. అనే వివరాలు తేల్చారు. సొంత పెట్టుబడి ద్వారా ఎంత కమీషన్ తీసుకున్నారు, ఖాతాదారుల పెట్టుబడుల ద్వారా ఎంత పొందారు.. అనే లెక్కలు కూడా తేలుస్తున్నారు. అసలు పెట్టుబడి కంటే తీసుకున్న కమీషన్ ఎక్కువ మొత్తంలో ఉన్నప్పుడు దాన్ని తిరిగి ఖాతాదారులకు చెల్లించాలని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. లేకపోతే ఆదిత్యతో పాటు కేసుల్లో నిందితులుగా చేర్చాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు. కేసుల తలనొప్పులు ఎందుకులే.. అనుకున్న ఏజెంట్లు లాభం మాట దేవుడెరుగు అసలు మిగిలితే చాలనుకుంటున్నారు. తమను కలిసిన బాధితులకు లాభాల కోసం ఆశ పడకుండా అసలుతో సరిపెట్టుకోవాలని చెబుతున్నారు. దీంతో ఏజెంట్లు తీసుకున్న కమీషన్ల నుంచి కింద ఉన్న ఖాతాదారులకు అసలు మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించుకున్నారు. ఇదే విషయాన్ని ఏజెంట్లు పోలీసులకు స్పష్టం చేస్తున్నారు. తాము పెట్టుబడులు పెట్టిన వారికి అసలు మొత్తాన్ని చెల్లిస్తామని కొందరు ఏజెంట్లు చెప్పినట్టు తెలిసింది.



దుర్గమ్మకు సారె సమర్పిస్తున్న భక్త బృందాలు

దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ



ఇంద్రకీలాద్రి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మకు శుక్రవారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తబృందాలు తరలివచ్చి సారె సమర్పించారు. ఆలయ ఉద్యోగులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఉచిత దర్శనం ఏర్పాటు చేశారు. ఈవో వీకే శీనానాయక్ అమ్మవారికి భక్తులు సమర్పిస్తున్న చీరలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కంప్యూటర్లో నమోదు చేసి ఎప్పటికప్పుడు నివేదికలను తెలియజేయాలని ఆదేశించారు. అమ్మవారికి సారె సమర్పించిన అనంతరం భక్తులకు ఉచిత ప్రసాదం అందజేశారు.



మంత్రి రవీంద్ర దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

దుర్గమ్మకు వెండి పళ్లెం కానుక

ఇంద్రకీలాద్రి : దేవస్థానంలో శుక్రవారం మంత్రి రవీంద్ర సతీసమేతంగా దుర్గమ్మవారికి చీర, సారె సమర్పించి వెండి పళ్లెం కానుకగా ఇచ్చారు. ఆలయ అధికారులు మంత్రి దంపతులకు సాదర స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారి దర్శనానంతరం అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఈవో

అభివృద్ధి పనులపై ఈవో సమీక్ష

ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రి దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఈవో వీకే శీనానాయక్ శుక్రవారం తన చాంబర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు, దాతలు పాల్గొన్నారు. దసరా మహోత్సవాలను దృష్టిలో ఉంచుకొని అన్నదాన, లడ్డూ తయారీ భవన నిర్మాణాలు, ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్, హిల్ ప్రొటెక్షన్, పూజా మందిరాలు, యాగశాల తదితర పనులు వేగవంతం చేయాలన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ అమలుపై చర్చించారు. అనంతరం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో యాగశాల దాత సంగా నరసింహారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోటేశ్వరరావు, ఇంజనీరింగ్ సిబ్బంది, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి మీడియేషన్ సెంటర్లు

» జిల్లా న్యాయాధికారి గోపి



మచిలీపట్నం టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : కేసుల సత్వర పరిష్కారానికి మీడియేషన్ సెంటర్ల ద్వారా 90 రోజుల పాటు న్యాయస్థానాలలో ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్టు కృష్ణాజిల్లా న్యాయాధికారి జి.గోపి తెలిపారు. శుక్రవారం బార్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుతున్న కాలానుగుణంగా న్యాయప్రక్రియలో మార్పులు రావాలని, సత్వర న్యాయం అందిస్తే కక్షిదారులకు న్యాయవ్యవస్థపై నమ్మకం ఏర్పడుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 64 మంది శిక్షణ పొందిన న్యాయవాదులు, సోషల్ వర్కర్లను మీడియేటర్లుగా ఏర్పాటు చేశామన్నారు. 90 రోజుల పాటు జిల్లాలోని అన్ని బార్ అసోసియేషన్లలో కేసులు పరిష్కరిస్తారన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్య మాట్లాడుతూ, మీడియేటర్లతో ఉభయ పార్టీల కేసులను శాంతియుతంగా పరిష్కరిస్తామన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.పోతురాజు మాట్లాడుతూ, అసోసియేషన్ భవనం రిపేర్లకు 20 లక్షలు అవసరమన్నారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ లంకె వెంకటేశ్వరరావు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ, వడ్డి జితేంద్ర, తుంగల హరిబాబు, కార్యదర్శి శాయన సుధాకరరావు తదితరులు మాట్లాడారు.

స్త్రీలను కించపరిచేలా మాట్లాడటం సిగ్గుచేటు

» ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్

చల్లపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : స్త్రీలను కించపరిచేలా నాయకులు మాట్లాడటం ఇంతకంటే సిగ్గుచేటైన పరిస్థితి ఈ రాష్ట్రంలో మరొకటి లేదని అవనిగడ్డ ఎమ్మెల్యే, ఏపీ అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్ మండలి బుద్ధప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం చల్లపల్లిలో ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రాజకీయాల్లో బేధాభిప్రాయలు ఉండవచ్చనీ, కానీ ఇంట్లో మహిళలను విమర్శించే పరిస్థితి చేయకూడదన్నారు. ఎంతటి తీవ్రమైన భాష వాడుతున్నారో మనం చూస్తున్నామని తెలిపారు.

దశాబ్దాలుగా బీసీలకు అన్యాయం

» బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గోవిందరావు

గాంధీనగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా 50 శాతానికి పైగా ఉన్న బీసీ సామాజిక వర్గానికి దశాబ్దాలుగా అన్యాయం జరుగుతోందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గోవిందరావు ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ హక్కుల సాధనకు ఈ నెల 20న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీసీలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ సామాజిక వర్గానికి జనగణనతో పాటు కులగణన చేపట్టాలని, కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, బీసీలపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో రక్షణ చట్టం తీసుకురావాలని, కేంద్రంలో ఖాళీగా ఉన్న బీసీ కమిషన్ సభ్యులను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు.

అన్నదాతకు ఆర్థిక భరోసా

» కిసాన్ క్రెడిట్ కార్డుతో కష్టాలు దూరం!
» రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణం
» విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోలులో రాయితీలు







(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ)

ఆరుగాలం కష్టించే అన్నదాతకు ఆర్థిక భరోసా కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం కిసాన్ క్రెడిట్ కార్డ్(కేసీసీ)ని అందుబాటులోకి తెచ్చింది. అప్పుల భారం, ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కేందుకు అర్హులైన ప్రతి ఒక్క రైతు ఆన్‌లైన్ ద్వారా సులువుగా కార్డును పొందే వెసులుబాటు ఉంది. రైతు ఆత్మహత్యలను నియంత్రించి వారికి మేలు చేకూర్చాలనే సదుద్దేశంతో ఈ కార్డుల మంజూరుకు కేంద్ర ప్రభుత్వం పూనుకుంది. అయితే ఈ పథకంపై సరైన అవగాహన లేకపోవడంతో పూర్తిస్థాయిలో రైతుల చెంతకు కార్డులు చేరడం లేదు. వ్యవసాయ అవసరాల నిమిత్తం అయ్యే ఖర్చుల కోసమే కిసాన్ క్రెడిట్ కార్డులను మంజూరు చేస్తారు.

ఎవరెవరికి వర్తిస్తుందంటే..

రైతులు, కౌలురైతులు, స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీ), జాయింట్ లయబులిటీ గ్రూప్స్(జెఎల్‌జీ) ఈ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. తాజా ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పాడి పరిశ్రమ రైతులు, మత్స్యకారులు సైతం దరఖాస్తు చేసుకునే వీలుంది. దరఖాస్తుదారుడి వయసు 18 నుంచి 75 ఏళ్ల లోపు ఉండాలి.

దరఖాస్తుచేసుకునే విధానం..

ఏ బ్యాంకు ద్వారా కేసీసీ పొందాలనుకుంటున్నారో.. ఆ బ్యాంకు వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. అందులో కేసీసీ ఆప్షన్‌ను 'అప్లై' సెలెక్ట్ చేయాలి. వెబ్‌సైట్‌లో ఓ దరఖాస్తు ఫారం ఓపెన్ అవుతుంది. దరఖాస్తు పూర్తిచేసి సబ్‌మిట్ చేస్తే.. దరఖాస్తు రిఫరెన్స్ నంబర్ బ్యాంకు నుంచి వస్తుంది. రిఫరెన్స్ నెంబర్ రాగానే మీరు ప్రాథమికంగా కార్డు పొందేందుకు అర్హత సాధించినట్టే. ఆ తరువాత బ్యాంకు అధికారులను సంప్రదించి పూర్తిచేసిన దరఖాస్తుకు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, డ్రైవింగ్ లైసెన్స్/ఆధార్/ఓటర్ కార్డ్/పాస్‌పోర్ట్, రెవెన్యూ అధికారులు మంజూరు చేసిన భూమి యజమాని పత్రం, విస్తీర్ణంలో సాగు చేసే పంట వివరాల పత్రం, సెక్యూరిటీ డాక్యుమెంట్స్‌ను జతచేసి అందజేయాలి. సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే 3 నుంచి 4 రోజుల్లో కార్డు పొందవచ్చు.

రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణం

రైతు సాగుచేసే విస్తీర్ణం, దరఖాస్తునకు జతచేసిన డాక్యుమెంట్ల ఆధారంగా రుణం బ్యాంకులు మంజూరు చేస్తాయి. కనిష్టంగా రూ.లక్ష, గరిష్టంగా రూ.5 లక్షల వరకు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వ ఆదేశాలున్నాయి. రూ. లక్ష రుణానికి సున్నా వడ్డీ, రూ.లక్ష నుంచి రూ.5 లక్షల లోపు రుణానికి పావలా వడ్డీ వర్తిస్తుంది. అయితే రుణానికి ఏడుశాతం వడ్డీ ఉంటుంది. కార్డులోని ఎంత డబ్బును వాడుకుంటే అంత మొత్తానికే వడ్డీ ఉంటుంది. ఇప్పటికే ఏటీఎం కార్డు ఉంటే దాన్ని కిసాన్ క్రెడిట్ అకౌంట్‌కు లింక్ చేసుకుంటే.. ఏటీఎం కార్డుగానూ, కేసీసీగానూ వాడుకోవచ్చు. ఈ కార్డుకు ఐదేళ్ల కాలపరిమితి ఉంటుంది. ఈ కార్డుల నుంచి నగదును ఏటీఎం, మైక్రో ఏటీఎం, సమీపంలోని బ్యాంక్ క్లర్క్(బీసీ), పీవోఎస్ యంత్రం ద్వారా పొందవచ్చు.

ఆర్థిక ఇబ్బందుల నుంచి రక్షణ

దళారులు, బడ్డీ వ్యాపారుల చేతిలో నలిగిపోకుండా కేసీసీ రక్షణ కల్పిస్తుంది. రైతులు స్వీయ ఆలోచనలతో స్వతంత్రంగా వ్యవసాయ పనిముట్లు, సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. మత్స్యకారులు వలలు, నావలు, ఐస్ బాక్స్‌లు కొనుగోలు చేసుకోవచ్చు. పాడి రైతులు నిర్భయంగా పశుపోషణ చేసుకుని అప్పుల నుంచి బయటపడొచ్చు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో
చోరీ నిందితులు దొరికారు

» రూ. 13.56 లక్షల విలువైన స్టాంప్ పేపర్లు స్వాధీనం

గన్నవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపులు చోరీ చేసిన నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.13,56,300 లక్షలు విలువ చేసే స్టాంప్ పేపర్లు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆ కేసు వివరాలను ఆయన వెల్లడించారు. ఈనెల రెండో తేదీ రాత్రి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తాళాలు వేసి వెళ్లారు. మరుసటి రోజు ఉదయం తాళాలు పగులకొట్టి ఉండటాన్ని గమనించి సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్‌కు సిబ్బంది సమాచారం ఇచ్చారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయగా 171-2022 యు-ఎస్ 331 (4),305(ఇ) సెక్షన్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. టెక్నికల్, నాన్ టెక్నికల్ అంశాల ఆధారంగా నిందితులను గుర్తించినట్టు చెప్పారు. సుమారు 35 నుంచి 55 మధ్య వయస్సు గల నలుగురు వ్యక్తులు ఆగిరిపల్లి నుంచి నూజివీడు వెళ్లే రహదారిలో పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా సీఐ బీవీ శివప్రసాద్ సిబ్బందితో కలిసి వారిని అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. అనంతరం విచారించగా విజయవాడ పటమట స్టేషన్ పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2023, 2024 లో చోరీ చేసిన స్టాంపులు, గన్నవరం కార్యాలయంలో చోరీ చేసిన స్టాంపులు, స్టాంప్ పేపర్లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. నిందితులు సీసీకెమేరాల్లో పడకుండా హెల్మెట్లు ధరించి చోరీలకు పాల్పడతారని తెలిపారు. వీరు కొద్ది సంవత్సరాల నుంచి దొరకక్కుండా నేరాలు చేస్తున్నట్టు వివరించారు. ఏ1గా విస్సన్నపేట మండలం తాతకుంట్లకు చెందిన వడ్లమూడి చన్నరావు, ఏ2-వడ్లమూడి రాంబాబు, ఏ3-వడ్రాణపు శ్రీనివాసరావు, ఏ4-మర్లపాలెంకు చెందిన ఏనుగు అంకినీడు ప్రసాద్‌లను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్టు తెలిపారు. ఎస్సై శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

పర్యాటక రంగ అభివృద్ధికి ప్రణాళిక

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

భారతీనగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నవ్యరాజధాని అమరావతికి గేట్ వే అయిన విజయవాడను సిటీ ఆఫ్ విక్టరీగా తీర్చిదిద్దేందుకు ఎన్టీఆర్ జిల్లా సమగ్రాభివృద్ధిలో మీడియా పాత్ర కీలకమని, యోగాంధ్ర వంటి వివిధ అంశాలపై ప్రజల్లో చైతన్యం తేవడంలో మీడియా చేస్తున్న కృషి అనిర్వచనీయమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర విజయవంతమైన నేపథ్యంలో గురునానక్ కాలనీలోని శుభలగ్నం వేదికలో మీడియా ప్రతినిధుల ఆత్మీయ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆరోగ్య ఆంధ్ర, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధన దిశగా ముఖ్యమంత్రి దార్శనికతతో రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించిన యోగాంధ్ర విజయవంతానికి మీడియా విశేష కృషి చేసిందన్నారు. విజయవాడతో పాటు జిల్లా అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించేందుకు మీడియా చేయూత అందించాలని కోరారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి అపార అవకాశాలున్న నేపథ్యంలో కొత్త టూరిజం సర్క్యూట్లపై దృష్టిపెడుతున్నామని, టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం అభివృద్ధికి దార్శనిక ప్రణాళికలు రూపొందించినట్టు చెప్పారు. మూలపాడు బటర్‌ఫ్లై పార్క్, జీవవైవిధ్య పార్కు, బుద్ధిస్ట్ సర్క్యూట్, కొండపల్లి బొమ్మల ఎక్స్‌పీరియన్స్ సెంటర్ తదితరాల ఏర్పాటుకు కృషిచేస్తున్నట్టు తెలిపారు. అనంతరం కలెక్టర్ జి.లక్ష్మీశను జర్నలిస్టులు సన్మానించారు. కార్యక్రమంలో డీఐపీఆర్‌వో కేవీ రమణరావు, డీపీఆర్‌వో ఎస్. మోహనరావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, పబ్లిసిటీ సూపర్‌వైజర్ వీవీ ప్రసాద్, వివిధ మీడియా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ



నారాయణ భరత్ గుప్తాకు వినతిపత్రం అందజేస్తున్న మైనార్టీ నాయకులు

ఉర్దూ లెక్చరర్లను నియమించండి

» ఉన్నత విద్యాశాఖ కమిషనర్‌కు మైనార్టీ నేతల వినతి

విద్యాధరపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలలోని ఉర్దూ విభాగంలో పర్మినెంట్ లెక్చరర్లను నియమించాలని టీడీపీ మైనార్టీ నాయకులు ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్తాను కోరారు. శుక్రవారం మంగళగిరిలోని ఉన్నత విద్యాశాఖ కమిషనర్‌ను ఆయన కార్యాలయంలో టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్ ఆధ్వర్యంలో పలువురు నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు కళాశాల ఉర్దూ విభాగంలో సమస్యలను వివరించారు. విజయవాడ నగరంలో ఉర్దూ హైస్కూల్స్ ఎక్కువగా ఉన్నాయని, పదో తరగతి పాసైన విద్యార్థులు ఇంటర్మీడియట్, డిగ్రీలలో రెండవ భాషగా ఉర్దూను చదివేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. కళాశాల ఉర్దూ విభాగంలో లెక్చరర్ల కొరత ఉందని, కనీస వసతులు కూడా లేవని ఆయనకు వివరించారు. సమస్యల పై ఇటీవల విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సిఫార్స్ మేరకు ముస్లిం మైనార్టీ నాయకులు విద్యాశాఖ కమిషన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అబ్దుల్‌సలీం, మహమ్మద్ ఖాన్, సయ్యద్ సంధానీ, మన్సూర్ బేగ్ తదితరులు ఉన్నారు.

మత్తు చాక్లెట్లు!

(5వ పేజీ తరువాయి)

ఉదంతాలు ఉన్నాయి.

స్కూల్, కాలేజీ విద్యార్థులే లక్ష్యం

గడిచిన ఐదేళ్లలో గంజాయి నగరాలను దాటి పట్టణాలు, పల్లెలకు విస్తరించిన విషయం తెలిసిందే. 13 నుంచి 22 ఏళ్ల వయసున్న యువత నేడు గంజాయికి బానిసలయ్యారు. ఎనిమిది, తొమ్మిది తరగతి విద్యార్థులను సైతం స్మగ్లర్లు అక్రమ రవాణాకు వాడుకుంటున్నారు. యువతకు పెద్ద పెద్ద మాల్స్‌లో జల్సా లైఫ్‌ను రుచి చూపించి కొరియర్‌లుగా మార్చేస్తున్న వైనాన్ని గతంలో పోలీసులు గుర్తించి, బాధ్యులైన స్మగ్లర్లను అదుపులోకి తీసుకుని జైలుకు పంపారు. విద్యా సంస్థల్లో మత్తుకు పెరిగిన డిమాండ్‌ను క్యాష్ చేసుకునేందుకు గంజాయిని చాక్లెట్ రూపంలోకి మార్చారు. ఒక్కో చాక్లెట్‌ను రూ.20 నుంచి రూ.50కి విక్రయిస్తున్నట్టు సమాచారం. అదేవిధంగా పాలల్లో సైతం కలిపి తాగేందుకు వీలుగా గంజాయి మొత్తటి పొడి(బూస్ట్, హార్లిక్స్ రంగుల మాదిరి)గా తీర్చిదిద్దుతున్నారు. ఇంట్లో వారికి సైతం అనుమానం రాకుండా ఉండటంతో మత్తుకు బానిసలైన యువతీయువకులు ఈ పొడి, చాక్లెట్‌లను ఇష్టపడుతున్నట్టు పోలీసు విచారణలో తేలింది. విజయవాడ నగరంలోని చిల్లర దుకాణాలు, బడ్డీ కొట్లలో వీటి విక్రయాలు ఊపందుకుంటున్నట్టు పోలీసు శాఖ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం బడ్డీ కొట్లు, చిల్లర దుకాణాల్లో తనిఖీలను పోలీసులు ముమ్మరం చేశారు. జనావాసాలకు కాస్త దూరంగా ఉండే దుకాణాల్లో వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నట్టు సమాచారం. ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థల సమీపంలోని దుకాణాల్లో జరిపిన సోదాల్లో పలు చోట్ల గంజాయి మూలాలను గుర్తించారు.

అర్ధరాత్రి అక్రమాలు

నిశీధిలో పోలవరం మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. పగలు కంటికి కనిపించకుండా, అర్ధరాత్రి 12 గంటలు మొదలు తెల్లవారే వరకు పోలవరం కట్ట మట్టిని తవ్వేస్తున్నారు. రాత్రికి రాత్రి వందలాది క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వేసి తోటల్లో డంప్ చేస్తున్నారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు ఇరిగేషన్ బృందం గురువారం అర్ధరాత్రి దాడులు చేసి అక్రమ తవ్వకాలను వెలుగులోకి తెచ్చింది. కాగా, మట్టి డంపింగ్‌ను పరిశీలించడానికి ఓ తోటలోకి వెళ్లిన అధికారులను కాపలాదారుడు లోపలే పెట్టి గేటుకు తాళం వేయడం గమనార్హం.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వైసీపీ ప్రభుత్వ హయాంలో కొత్తూరు తాడేపల్లిలో పోలవరం మట్టిని అక్రమార్కులు ఏ విధంగా తవ్వుకున్నారో అందరికీ తెలిసిందే. ఈ అక్రమాలపై విజిలెన్స్ అధికారులు విచారణ కూడా జరిపారు. పోలవరం మట్టి తవ్వకాల వ్యవహారాలపై కోర్టుల్లో కేసులు కూడా నడుస్తున్నాయి. అయినా అక్రమార్కులు భయపడట్లేదు. కూటమి ప్రభుత్వం వచ్చినా భయం లేదన్నట్టుగా చెలరేగిపోతున్నారు. గురువారం అర్ధరాత్రి తాడేపల్లిలో ఓ తోట వెంబడి ఉన్న పోలవరం కట్ట మట్టిని యథేచ్ఛగా ఎక్స్‌కవేటర్లతో తవ్వేశారు. ఆ మట్టిని తరలిస్తుండగా గ్రామస్తులు వీడియో తీసి అప్పటికప్పుడు పోలవరం ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును అందుకున్న పోలవరం ఇరిగేషన్ డీఈఈ అప్పిరెడ్డి, జేఈఈలు కిషోర్, కౌశిక్ బృందం కొత్తూరు తాడేపల్లికి చేరుకుంది. అధికారుల బృందం వస్తుండటాన్ని గమనించిన అక్రమార్కులు అక్కడి నుంచి పారిపోయారు. అర్ధరాత్రి మట్టిని తవ్వటాన్ని అధికారుల బృందం గుర్తించింది. కాల్వకట్టపై ఏపీ 40ఏఈ 8316 నెంబర్ కలిగిన ఎక్స్‌కవేటర్‌తో మట్టి తవ్వుతుండటాన్ని అధికారులు గమనించి నిలుపుదల చేయించారు. తవ్విన మట్టి తోటలో ఎంతవేశారో చూద్దామని డీఈ అప్పిరెడ్డి.. జేఈఈ కిషోర్‌ను పురమాయించారు. ఆయన తోటలోకి వెళ్లి పరిశీలిస్తున్న సమయంలో ఆ తోట కాపలాదారుడు గేట్లకు తాళం వేసి పారిపోయాడు. తనను తోటలో ఉంచి తాళం వేసిన విషయాన్ని జేఈఈ కిషోర్.. డీఈ అప్పిరెడ్డికి చెప్పారు. గ్రామస్తులు అక్కడికి చేరుకుని తోట గేటు తాళం పగలగొట్టి కిషోర్‌ను బయటకు తీసుకొచ్చారు.

పక్కాగా లెక్కలు

పోలవరం మట్టిని అక్రమంగా తవ్వుతున్న విషయాన్ని ఇరిగేషన్ అధికారుల బృందం గుర్తించటంతో పాటు ఎంతమేర మట్టి తవ్వారు? ఎంత నష్టం వాటిల్లింది? అనే లెక్కలు వేశారు. స్వాధీనం చేసుకున్న ఎక్స్‌కవేటర్‌ను టూటౌన్ పోలీసులకు అప్పగించారు. శుక్రవారం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కొద్దిరోజులుగా దాదాపు 5 వేల క్యూబిక్ మీటర్ల పోలవరం మట్టిని తవ్వుకుపోయారని తెలుస్తోంది. దీని విలువ రూ.8.50 లక్షలు ఉంటుందని నిర్ధారించినట్టు కిషోర్ పోలీసులకు తెలిపారు.



మోటురాయి తరలిస్తూ పట్టుబడిన ట్రాక్టర్లు

అక్రమ రవాణాపై దాడులు

» టిప్పరు, ట్రాక్టర్లు స్వాధీనం



జగ్గయ్యపేట రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తోట సూర్యశ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఉదయం ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించి గండ్రాయి-మల్కాపురం రోడ్డు నుంచి తెలంగాణకు వెళ్తున్న లారీని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కీసర ఇసుక క్వారీ నుంచి గండ్రాయి వే బిల్లుతో వెళుతున్న వాహన యజమాని ముత్తవరపు శిఖామణి, డ్రైవర్ రవికుమార్‌లపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కాగా 50 టన్నులకు పైగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌లు జాతీయ రహదారిపై నంబర్ ప్లేట్‌లు లేకుండా తిరుగుతున్నా రవాణాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రహదారులపై అనధికారికంగా తిరిగే వాహనాలపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

మోటురాయి తరలిస్తున్న ట్రాక్టర్ల స్వాధీనం

ధర్మవరప్పాడు తండా నుంచి పెనుగంచిప్రోలు మండలానికి అక్రమంగా మోటురాయి తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మున్నేటికి వరదల కారణంగా తువ్వకాల్వకు గండ్లు పడటంతో వాటిని పూడ్చేందుకు అనుమతులు లేకుండానే ధర్మవరప్పాడుతండాకు చెందిన రైతు భూమిలోని గుట్ట నుంచి రాయిని తరలిస్తున్నట్టు ప్రాథమికంగా నిర్ధారించామని, పూర్తిస్థాయి విచారణ చేస్తున్నట్టు తెలిపారు.



గంజాయి చాక్లెట్లను చూపుతున్న రైల్వే డీసీపీ రత్నరాజు

రైలులో గంజాయి చాక్లెట్ల స్వాధీనం

రైల్వేస్టేషన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో శుక్రవారం తనిఖీలు జరిపి ఒక యువకుడి నుంచి గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నట్టు రైల్వే డీసీపీ రత్నరాజు తెలిపారు. గంజాయి, మత్తుపదార్థాల ఏరివేతకు ఆపరేషన్ ఫ్లష్ అవుట్ చేపట్టామని రైల్వే సీఐ రమణ, సత్యనారాయణపురం సీఐ లక్ష్మీనారాయణ సిబ్బందితో రైల్వే స్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫారాలు, వచ్చే పోయే రైళ్ల బోగీలలో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశామన్నారు. పశ్చిమ బెంగాల్ నుంచి విజయవాడ రైల్వే స్టేషన్‌కు వచ్చిన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు నిర్వహించగా, ఓ బోగీలో గంజాయితో ప్యాక్ చేసిన చాక్లెట్లను తీసుకువెళుతున్న యువకుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. గంజాయిని చాక్లెట్ ఉండలుగా మార్చి రవాణా చేస్తున్నట్టు గుర్తించామన్నారు. ఒడిషా, పశ్చిమ బెంగాల్ నుంచి చెన్నైకు అధికంగా గంజాయి తరలిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌ని గంజాయి రహిత రాష్ట్రంగా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గంజాయి రవాణాను అరికట్టడానికి డీజీపీ ఆదేశాల మేరకు ఈగల్ టీమ్ ఐజీ రవికృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు, రైల్వే పోలీసులు, ఆర్పీఎఫ్, ఈగల్ టీమ్‌లు బృందాలుగా ఏర్పడి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

ముంపు భయం!

(5వ పేజీ తరువాయి)

కురవడంతో వర్షపు నీరు డ్రెయిన్‌లలోకి చేరి గుర్రపు డెక్క మరింతగా పెరిగింది. సముద్రపు పోటు వచ్చేంత వరకు డ్రైనేజీల్లో ఉన్న గుర్రపు డెక్క తదితరాలను నిర్మూలించేందుకు రసాయనాలు పిచికారీ చేసేందుకు ఈ ఏడాది నిధులు విడుదల చేయబోమని డ్రైనేజీ అధికారులు ఆంక్షలు పెట్టారు. దీంతో సాగునీటి సంఘాల ద్వారా రసాయనాలు పిచికారీ పనులు చేయలేదు. నవంబరు వరకు అనుకోనిస్థితిలో భారీ వర్షాలు కురిస్తే డ్రెయిన్‌ల ద్వారా సక్రమంగా మురుగునీరు బయటకు పోదని, పంట పొలాలు నీట మునుగుతాయని రైతుల్లో ఆందోళన నెలకొంది. నందివాడ మండలం రాళ్లకోడు, భూమికోడు డ్రెయిన్‌లలో కిక్కిస తొలగింపు పనులు ఇటీవల ప్రారంభించారు. భూమికోడు ఐదు కిలోమీటర్ల పొడవు ఉంటే 2.40 కిలోమీటర్ల పనులు చేసేందుకు అనుమతులు ఇచ్చారు. తుమ్మలపల్లి, వెన్ననపూడి, ఇలప్రరు, గంగాదేవి, గాలికోడు, ఇలపర్రు డ్రెయిన్‌లలో పనులకు 40శాతం తక్కువకు టెండర్లు కాంట్రాక్టర్‌లు దక్కించుకోవడం గమనార్హం. పామర్రు మండలం కొమరవోలు డ్రెయిన్ పూడికతీత పనులను కొమరవోలు, పెదమద్దాలి, జమీగొల్వేపల్లి రైతులే స్వచ్ఛందంగా చేయించుకుంటున్నారు. గుడివాడ మండలం మల్లాయపాలెం డ్రెయిన్‌ను రూ. 5 లక్షలతో పూర్తి చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)



బ్రాయిలర్ బర్డ్	103, 111, 122
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

నేర నియంత్రణకు పోలీసుల పల్లెనిద్ర

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు, పోలీసులకు మధ్య సత్సంబంధాలు ఏర్పరచుకుంటూ నేరాల నియంత్రణే పోలీసుల పల్లెనిద్ర లక్ష్యమని ఎస్సై బి.సురేష్ అన్నారు. బిళ్లనపల్లిలో గురువారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహించారు. అసాంఘిక శక్తులకు సహకరించవద్దని, అనుమానాస్పద వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, అధికసంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



బిళ్లనపల్లిలో పల్లెనిద్రలో భాగంగా గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహిస్తున్న ఎస్సై బి.సురేష్

బస్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచాలి

హనుమాన్‌జంక్షన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండ బస్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా ప్రజారవాణాధికారి కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రజారవాణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో మొదటి సారిగా గురువారం రాత్రి హనుమాన్ జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్‌ను తనిఖీ చేశారు. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని, బస్సులు రాకపోకల విషయంలో సమయపాలన పాటించే విధంగా పర్యవేక్షించాలని డిపో మేనేజర్ పి.శివాజీకి సూచించారు.

4,875 కుటుంబాలు పీ-4 కింద గుర్తింపు

హనుమాన్‌జంక్షన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పేదరికం నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీ-4 కార్యక్రమం కింద మండలంలో 4,875 కుటుంబాలను పేదలుగా గుర్తించినట్లు బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఇప్పటి వరకు టీడీపీ నేతలు దయాల రాజేశ్వరరావు, దుట్టా శివన్నారాయణ, అట్లూరి శ్రీనివాసరావు పేదలను దత్తత తీసుకోవడానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు.

పనిలో నిబద్ధత ఉండాలి

కానూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పనిలో నిబద్ధత ఉండాలని తాడిగడప మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం తాడిగడప పరిధిలోని పోరంకి, కానూరు గ్రామాల్లో అమలవుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ పరిశీలించారు. ట్రాక్టర్‌లోకి చెత్తఎత్తే విధానం, పారిశుధ్య సిబ్బంది పనితీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు సూచనలు చేశారు.

నర్సింగ్ విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలి

గన్నవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలని కళాశాల కన్వీనర్ డాక్టర్ ఎస్ రాజ్‌గోపాల్ అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ సి.శోభనాద్రి సిద్ధార్థ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు హర్యానాలోని ఎల్లెనాబాద్‌లో దివ్య యువ మంచ్ ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 7 వరకు జరిగిన నాలుగవ అంతర్జాతీయ సదస్సులో పాల్గొని బహుమతులు సాధించగా శుక్రవారం వారి అభినందన సభ జరిగింది.

బాబాకు గులాబీల అర్చన

ఉయ్యూరు, జూలై 11 (ఆంధ్ర జ్యోతి) : గండిగుంట బైపాస్ అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణం షిర్డీ సాయిబాబా మందిరంలో శుక్ర వారం లక్షగులాబీల అర్చన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బాబా విగ్రహానికి అభిషేకాలు, పూజలు, లక్ష గులాబీ పూలతో అర్చన వైభవంగా నిర్వహించారు. బొప్పిడి ఉషా రామకృష్ణ, కంచర్ల గంగాధర రావు, మండవ జయదేవ్ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కానూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కానూరు 33/11కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా శనివారం కానూరు సెక్షన్‌లోని పలు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుణదల విద్యుత్ శాఖ ఈఈ పి. హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కానూరు లాస్ట్ బస్సు స్టాప్ ఏరియా, పెదబావి సెంటర్, యాదవుల బజారు, రంగా బొమ్మ సెంటర్ ప్రాంతం, హోల్డేజ్ హోమ్ ప్రాంతం, రాజ్‌కమల్ బిల్డింగ్ ఏరియా, కెనడీ స్కూల్ ఏరియా, కామయ్య తోపు, జేఆర్‌డీ ప్రాంతంలోని కొంతభాగం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కంకిపాడు : ఈడుపుగల్లు, కోలవెన్ను 11కేవీ సబ్‌స్టేషన్లలో మెయిన్‌టెన్సు పనుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి పది గంటల వరకు కోలవెన్ను, కుందేరు, ఈడుపుగల్లు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని గుణదల విద్యుత్ శాఖ ఈఈ హరిబాబు తెలిపారు.

ఉంగుటూరు : 33/11కేవీ ఆత్కూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల ఆధునికీకరణ పనుల దృష్ట్యా శనివారం ఉదయం 7గంటలనుంచి మధ్యాహ్నం 2గంటలవరకు ఆత్కూరు గ్రామంలో విద్యుత్ సరఫరాను నిరవధికంగా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ గుడివాడ ఈఈ జీబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

గన్నవరంలో 1కె రన్

గన్నవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మీడియేషన్ ద్వారానే కేసులు పరిష్కరించుకోవాలని న్యాయమూర్తి అరుణ శ్రీ అన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ప్రచారంలో భాగంగా గన్నవరంలో 1కె రన్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి అరుణశ్రీ మాట్లాడుతూ, కక్షిదారులు మీడియేషన్ సెంటర్‌లను వినియోగించుకోవాలన్నారు. వీటి ద్వారా కేసుల పరిష్కారం ఉత్తమమైనదని తెలిపారు. జడ్జి గాయత్రి, న్యాయవాదులు పాల్గొన్నారు.

చెత్తశుద్ధి ఏదీ!

● కానూరులో అడుగడుగునా చెత్తకుప్పలు.. అస్తవ్యస్త డ్రెయినేజీ
● ఇబ్బందిపడుతున్న స్థానికులు... దృష్టిసారించని అధికారులు..

(కానూరు - ఆంధ్రజ్యోతి)

తాడిగడప మునిసిపాలిటీ పరిధిలోని కానూరులోని పలు ప్రాంతాల్లో చెత్తకుప్పలు, అస్తవ్యస్త డ్రెయినేజీ దర్శనమిస్తోంది. అశోక్‌నగర్, తులసీనగర్‌లోని పలు వీధుల్లో చెత్తకుప్పలు రోడ్ల వెంట పేరుకు పోయాయి. ఈ చెత్త నుంచి వ్యర్థాలు గాలికి ఇళ్లలోకి చేరి అనారోగ్య పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సకాలంలో పారిశుధ్య సిబ్బంది చెత్త సేకరణకు ఇళ్లకు వెళ్లక పోవడం వల్ల పలువురు తమ ఇళ్లల్లోని చెత్తను రోడ్లపై పడేస్తున్నారు. దీంతో రోడ్ల వెంట చెత్తకుప్పలు కనిపిస్తున్నాయి. దీనికితోడు అవసరమైన మేర పారిశుధ్య సిబ్బంది లేకపోవడం కూడా పెద్ద సమస్యగా తలెత్తింది. స్థానిక పంటకాలువ రోడ్డులోని ఓపెన్ మేజర్ డ్రెయినేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకు పోవడంతో నీరు ముందుకు వెళ్లక ఇక్కడికక్కడే నిలిసిపోతున్నాయి. దీనిపై తాడిగడప మున్సిపల్ అధికారులు తగు శ్రద్ధ వహించాలని ప్రజలు కోరుతున్నారు.



కానూరు పంటకాలువ రోడ్డులో మేజర్ డ్రెయినేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలు.. అశోక్‌నగర్‌లో పేరుకుపోయిన చెత్త



పోరంకిలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో అనుమోలు ప్రభాకరరావు.. పెదపులిపాకలో.. కంకిపాడులో ..

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలో పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికి సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందజేస్తున్నా మని ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. సుపరిపాలనో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆకునూరులో పర్యటించారు. బీసీ, ఎస్సీ కాలనీలతో పాటు పలు ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అమలుపై వాకబు చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆకునూరులో 9 సీసీ రోడ్లు, సీసీ డ్రైయినేజీల నిర్మాణం చేపట్టామని సర్పంచ్ గోలి వసంత కుమార్ అన్నారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు వెంకన్న, తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎంపీడీవో శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు : రాష్ట్రంలో సుపరిపాలన టీడీపీ కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, పెనమలూరు మండలాధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్‌లు పేర్కొన్నారు. శుక్రవారం వారు పోరంకి బీజేఆర్‌నగర్, గోసాల గ్రామాల్లో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని స్థానికులతో మాట్లాడారు. ఐదేళ్ల రాక్షస పాలనలో రాష్ట్రం పాతికేళ్లు వెనక్కి మళ్లిందని, తిరిగి రాష్ట్రాన్ని గాడిలో పెట్టే పనిలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు నిమగ్నమయ్యారని పేర్కొన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన అభివృద్ధిని వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. మాబు సుభాని, కోనేరు వెంకటేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.



ఆకునూరులో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, రాజేంద్రప్రసాద్

● పెదపులిపాకలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు దాసరి హరినీడు, ముసునూరు శ్రీనివాసరావు, శ్రీధర్, గుజ్జర్లపూడి బాబూరావు, గుంటూరు విశ్వేశ్వరరావు, నాగరాజు, సతీష్, వినయ్ తదితరులు పాల్గొని స్థానికులకు టీడీపీ కూటమి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు.

కంకిపాడు : అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు సంగెపు రంగారావు అన్నారు. కంకిపాడులో శుక్రవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరువ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ డ్వాక్రా అసోసియేషన్ కార్యదర్శి అన్నవరపు శివ పార్వతి, షేక్ సలీం తదితరులు పాల్గొన్నారు.

కనదుర్గమ్మకు ఆషాఢ సారె

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : లోక కల్యాణం కోసం కనకదుర్గ అమ్మవారికి ఆషాఢసారె సమర్పించడం ఆనవాయితీ అని ధర్మకర్త వంగపండు ప్రకాష్ తెలిపారు. వీరవల్లి బైపాస్ పక్కన కొలువైన కనకదుర్గమ్మకు శుక్రవారం వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో శాకాంబరీ అలంకరణ నిర్వహించి ఆషాఢసారెను సమర్పించారు. ఉమామహేశ్వరపురం, కోడూరుపాడు, తదితర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు ఊరేగింపుగా పసుపు, కుంకుమ, పండ్లు, పుష్పాలు, నూతన వస్త్రాలతో కూడిన సారెను మేళతాళాల మధ్య జైదుర్గ నామస్మరణతో అమ్మవారి ఆలయానికి చేరుకుని సారె సమర్పించారు.



వీరవల్లి కనకదుర్గమ్మకు సారె సమర్పిస్తున్న ప్రకాష్ దంపతులు

గన్నవరం : మండలంలోని బుద్ధవరం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆషాఢమాసం సందర్భంగా శుక్రవారం అమ్మవారికి ఘనంగా ఆషాఢ సారెను భక్తులు సమర్పించారు. తొలుత అభయాంజనేయస్వామికి విశేష పూజలు చేశారు. సీతారామచంద్ర స్వామికి సహస్రనామ అర్చనలు నిర్వహించారు. అనంతరం పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలు ఊరేగింపుగా బయలుదేరి గ్రామ దేవతలైన గంగానమ్మ, మహాలక్ష్మీదేవికి ఆషాఢ సారెను సమర్పించారు. అమ్మవారికి నక్క రంగారావు, నిర్మలకుమారి దంపతులు ప్రత్యేక లోహాలతో తయారు చేసిన పాదుకలను కానుకగా సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ నక్క రామారావు, అధ్యక్షులు గండికోట నాంచారయ్య, సభ్యులు తాడిశెట్టి శ్రీనివాసరావు, గండికోట గోవర్ధనరావు, నక్క కొండలస్వామి, రంగారావు, వెంకట్రామయ్య పాల్గొన్నారు.

ఉంగుటూరు : ఆత్కూరులో కనకదుర్గమ్మ శాకాంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు విరాళంగా సమర్పించిన వివిధరకాల కూరగాయలు, ఆకుకూరలు, దుంపలు, పండ్లు, కాయలతో ఆలయ కమిటీ పెద్దలు, అర్చకులు అమ్మవారిని శాకాంబరీదేవిగా అలంకరించారు. ఆలయ అర్చకులు ప్రతాప లక్ష్మీనారాయణ, కుమార్, పవన్, ఆలయ కమిటీ పెద్దలు రాజారెడ్డి, చిన్నా, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆకునూరులో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

ఉయ్యూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : తెలుగువారి కీర్తిప్రతిష్ఠలు, ఆత్మగౌరవాన్ని ప్రపంచ నలుదిశలా చాటి చెప్పిన ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరానికి ప్రతీకగా నిలిచారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఆకునూరులో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని శుక్రవారం సర్పంచ్ గోలి వసంత కుమార్‌తో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ స్థాపించి అనతి కాలంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చి పేదవారికి కూడు, గూడు, గుడ్డ కల్పించాలన్న మహోన్నత లక్ష్యంతో అనేక సంక్షేమ పథకాలు ప్రారంభించి తెలుగువారి గుండెల్లో సుస్థిర స్థానం ఏర్పరుచుకున్న మహానాయకుడు ఎన్టీఆర్ అని కీర్తించారు. గ్రామపార్టీ అధ్యక్షుడు వెంకన్న, పోతిరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



రైతుల అభ్యున్నతే లక్ష్యం: చైర్‌పర్సన్ రమా

గన్నవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : రైతుల అభ్యున్నతే లక్ష్యమని మేడేపల్లి రమా అన్నారు. మండలంలోని ముస్తాబాద పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా మేడేపల్లి రమా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి వన్నె తెస్తానని చెప్పారు. రైతులకు అందుబాటులో ఉండి సకాలంలో రుణాలు ఇప్పించటంలో ముందుంటామని తెలిపారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కేడీసీసీ చైర్మన్‌గా పనిచేసి ఏ విధంగా అయితే బ్యాంకును ముందంజలో ఉంచారో అదే స్ఫూర్తితో ముస్తాబాద పీఏసీఎస్‌ను జిల్లాలో ముందంజలో ఉండే విధంగా కృషి చేస్తానని తెలిపారు. డైరెక్టర్‌లు షేక్ కరిముల్లా, పల్లి కార్తిక్, కార్యదర్శి గురవయ్య, చిమట రవివర్మ, కడియాల రాజా, పాలడుగు మల్లికార్జునరావు, కడియాల కోటయ్య, కొసరాజు సాయిరాం, వెంకటేశ్వరరావు, కిషోర్, అనిల్, సతీష్ పాల్గొన్నారు.



చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రమా

రోడ్డుప్రమాదంలో జనసేన కార్యకర్త మృతి

ఉంగుటూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై పొట్టిపాడు గ్రామశివారు కొత్తూరు పెట్రోల్‌బంకు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో జనసేన పార్టీ కార్యకర్త మృతి చెందాడు. ఆత్కూరు ఎస్సై చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం రుద్రంకోట గ్రామానికి చెందిన సావలి శివప్రసాద్ (36) జనసేన పార్టీ కార్యకర్తగా వుంటూ, ప్రస్తుతం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నాడు. సాయంత్రం 5 గంటలకు తన విధులు ముగించుకుని బైక్‌పై ఏలూరువైపు వెళ్తున్న శివప్రసాద్‌ను అదేమార్గంలో వేగంగా వెళ్తున్న కోళ్ల వ్యాన్ వెనుక నుంచి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వ్యాన్ డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం గన్నవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు.



ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి చర్యలు

కంకిపాడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదేశాలతో కంకిపాడు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి పక్కా చర్యలు చేపడుతున్నట్లు టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాలకు అవసరమైన కనీస సౌకర్యాలపై ఆరా తీశారు. పాఠశాల వద్ద ఉదయం సాయంత్రం పోలీసు పికెట్ ఏర్పా టు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్సై డి. సందీప్‌ను కోరారు. ఈ కార్యక్ర మంలో ఎస్సై డి. సందీప్, పాఠశాల హెచ్‌ఎం డి. ఉమాదేవి, క్లస్టర్ కో కన్వీనర్ పులి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు చిట్టూరి నాగేశ్వరరావు, కొండా నాగేశ్వరరావు, వీరంకి శ్యామ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కంకిపాడు పాఠశాల అభివృద్ధికి ఎస్సైతో చర్చిస్తున్న తుమ్మలపల్లి హరికృష్ణ

నేటి నుంచి కేంద్ర బృందం పర్యటన

ఉయ్యూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించేందుకు కేంద్ర బృందం శనివారం నుంచి గ్రామాలలో పర్యటించనున్నట్టు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. కలవపాముల, సాయిపురం, కడవకొల్లు, ఆకునూరు, చినఓగిరాల, పెదఓగిరాలలో పర్యటించవచ్చని పేర్కొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న నార్ల వెంకటేశ్వరావు

సీపీఐ కృష్ణాజిల్లా కార్యదర్శిగా నార్ల వెంకటేశ్వరావు

గన్నవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ కృష్ణాజిల్లా కార్యదర్శిగా నార్ల వెంకటేశ్వరావు, సహాయ కార్యదర్శిగా అడ్డాడ ప్రసాద్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ నాయకులు శుక్రవారం గన్నవరంలో విలేకరుల సమావేశంలో తెలిపారు. గన్నవరంలో ఇటీవల జరిగిన సీపీఐ జిల్లా మహాసభలో కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు. 35 మంది కౌన్సిల్ సభ్యులు, ఇద్దరు క్యాండిడేట్ సభ్యులను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుందన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా చెరుకు శ్రీనివాసరావు, హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, పేరిశెట్టి ఉమాకాంతం, గుత్తికొండ రామారావు, కాట్రగడ్డ రామచంద్ర జోషి, మున్నంగి నరసింహారావు, మల్లిపెద్ది రత్నకుమారి, ఆహ్వానితులుగా గూడపాటి ప్రకాష్‌బాబు, మాలేంపాటి కాంచనరావులను ఎన్నుకున్నట్లు చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరావు మహాసభ తీర్మానాలను వెల్లడించారు. పీఏసీఎస్‌లకు వెంటనే ఎన్నికలు జరపాలని, బుడమేరులో ఆక్రమణలు తొలగించాలని, చేనేత కార్మిక బకాయిలు రూ.177 కోట్లు వెంటనే విడుదల చేయాలని, మచిలీపట్నం- రేపల్లె రైల్వేలైన్ వెంటనే చేపట్టాలని తదితర తీర్మానాలను వివరించారు.

బోగస్ మరణ ధ్రువీకరణ పత్రం రద్దు

పమిడిముక్కల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : వీరంకి గ్రామానికి చెందిన పామర్తి లక్ష్మీపతి కుటుంబానికి రెవెన్యూ జారీ చేసిన బోగస్ మరణ ధ్రువీకరణ పత్రాన్ని ఉయ్యూరు ఆర్డీవో రద్దు చేశారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా హొస్‌పేటలో 1993లో లక్ష్మీపతి మరణించారు. అయితే, 2016లో లక్ష్మీపతి వీరంకిలో మరణించినట్టుగా నమోదు చేసి అతని కుటుంబసభ్యులు మరణ ధ్రువీకరణ పత్రం తీసుకున్నారు. పామర్తి లక్ష్మీపతి మరణాన్ని వీరంకి గ్రామపంచాయతీలో నమోదుకు అనుమతించిన అప్పటి తహసీల్దార్, రెవెన్యూ, గ్రామపంచాయతీ అధికారులపై క్రమ శిక్షణ చర్యల నిమిత్త ఉపలోకాయుక్తకు ఆగష్టు 22, 2023న ఫిర్యాదు చేసినట్టు యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ క్యాంపెయిన్ ప్రతినిధులు జంపాన శ్రీనివాసగౌడ్, బేతపూడి జోగేశ్వరరావు, దుర్గాప్రసాద్ తెలిపారు. ఉపలోకాయుక్త జస్టిస్ పి.రజని ఆదేశాల మేరకు ఉయ్యూరు ఆర్డీవో విచారణ జరిపి బోగస్ ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేశారన్నారు.



ఇంగ్లండ్ వెళ్తున్న వరుణ్ సాత్విక్, రాజేష్‌లకు వీసా అందజేసి అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

ఇంగ్లండ్ క్రికెట్ పోటీలకు వరుణ్, రాజేష్

జగ్గయ్యపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ముంబైలోని దిలీప్ వెంగ్‌సర్కార్ ఫౌండేషన్ తరపున ఇంగ్లాండ్‌లో జరిగే టీ-20, వన్డే క్రికెట్ పోటీల్లో పాల్గొనే అవకాశం జగ్గయ్యపేట యువ క్రికెటర్లు ఇద్దరికి లభించింది. గత ఏడాది అండర్- 19లో బ్యాటింగ్‌లో సత్తా చాటిన వరుణ్ సాత్విక్, బౌలింగ్‌లో సత్తా చాటిన రాజేష్‌లకు దిలీప్ వెంగ్‌సర్కార్ ఫౌండేషన్ స్థానం కల్పించింది. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య శుక్రవారం బాలుర హైస్కూల్ క్రీడాప్రాంగణంలో ఇంగ్లాండ్ వెళ్తున్న సాత్విక్, రాజేష్‌లకు వీసా, పాస్‌పోర్టులను అందజేసి అభినందించారు. త్వరలోనే భారత జట్టుకు ఆడే అవకాశం పొందాలని ఆయన ఆకాంక్షించారు. డాక్టర్ శ్రీరాం సంజయ్‌కృష్ణ, చైర్మన్ రాఘవేంద్ర, పబ్బిశెట్టి బాబ్జీ, కోచ్ రాజేంద్రప్రసాద్, షైనేని రాధా కృష్ణ బోస్, పేరం సైదేశ్వరరావు, సుధీర్, రఘులు పాల్గొన్నారు.

సీజీహెచ్ఎస్ సీఎంవోగా డాక్టర్ తుకారం



విజయవాడ సిటీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్ఎస్) విజయవాడ సెంటర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ దారవత్ తుకారాం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరులో చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా పని చేసిన ఆయన బదిలీపై విజయవాడ కేంద్రానికి వచ్చారు. గవర్నర్‌పేటలోని కార్యాలయంలో ఇప్పటి వరకు మెడికల్ ఆఫీసర్‌గా పని చేసిన డాక్టర్ విద్య నుంచి ఆయన బాధ్యతలు తీసుకునారు.

గురువులకు సత్కారం



విజయవాడ కల్చరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : సంస్కార భారతి విజయవాడ మహానగర్ శాఖ అధ్వర్యంలో హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం గురుపూజోత్సవ నిర్వహించారు. వివిధ కళల్లో లబ్ధ ప్రతిష్ఠులైన గురువులను సత్కరించారు. చిట్టా శివప్రసాద్(నాటకం), గండూరి శ్రీనివాసమూర్తి (సంగీతం), చలికొండ ఉషా మాధవి(నాట్యం), దూళిపాల రామకృష్ణ (సాహిత్యం), శంకర ప్రభాకర మల్లికార్జునరావు (చిత్రలేఖనం)లను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. సంగీతం, నాట్యం, ఏకపాత్ర ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేశాయి. శ్రీరామ్ స్కూల్ విద్యార్థులు డాక్టర్ పీవీఎన్ కృష్ణ రచన, దర్శకత్వంలో బాల శివాజీ సమరస భావం భళీ భళీ అనే లఘు నాటిక ప్రదర్శించి అలరించారు. సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ, విశ్వహిందూ పరిషత్ నేత వి.దుర్గాప్రసాద్ రాజు మాట్లాడుతూ గురువులను గౌరవించడం, పూజించడం సంప్రదాయంలో భాగమన్నారు. వేద హాస్పటల్ డాక్టర్ శేష సాయి, హైకోర్టు న్యాయవాది సీవీ రావు, శ్రీరామ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ బోని సురేష్ పాల్గొన్నారు. సంస్కార భారతి మహానగర అధ్యక్షుడు పీవీ భాస్కర్ శర్మ జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించగా ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ శ్రావణ్‌కుమార్ వందన సమర్పణ చేశారు.



పవిత్ర సంగమం వద్ద కృష్ణానదిలో కలుస్తున్న గోదావరి జలాలు

రైతుల మోములో

పట్టిసీమ వెలుగులు

- కూటమి ప్రభుత్వం రాకతో పూర్వవైభవం
- ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే సాగునీరు విడుదల
- మాగాణి సాగుకు ఊతం ● నారుమళ్లకు జీవం

పట్టిసీమ ఎత్తిపోతల పథకం రైతు కళ్లలో వెలుగులు నింపుతోంది. 2014-19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి వరద జలాలు అందించడంతో కృష్ణాడెల్టా రైతులతో పాటు ఈప్రాంత రైతుల సాగు నీటి అవసరాలను తీర్చడ మే కాక అధిక దిగుబడులు సాధించేలా చేశాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చి న వైసీపీ ప్రభుత్వం పట్టిసీమను వట్టిసీమగా మార్చి రైతులకు సాగునీరు అం దించలేకపోయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే కృష్ణాడెల్టాకు సాగునీరు అందిస్తోంది.

(ఆంధ్రజ్యోతి-ఇబ్రహీంపట్నం)

ప్రస్తుతం 22 పంపుల ద్వారా 7,700 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. గోదావరి జలాలు పోలవరం కుడి కాలువ ద్వారా 188 కిలో మీటర్లు ప్రయాణం చేసి ఇబ్రహీంపట్నం వద్ద పవిత్రసంగమం ప్రాంతంలో కృష్ణానదిలో కలుస్తున్నాయి. పట్టిసీమ నీటితో కలిపి మొత్తం కృష్ణాడెల్టాకు 10 వేల క్యూసెక్కుల సాగునీటిని అధికారులు విడుదల చేస్తున్నారు. దీంతో కృష్ణాడెల్టాలోని 13 లక్షల ఎకరాలకు, కాలువ వెంబడి ఉన్న సుమారు లక్ష ఎకరాలకు సాగునీటి ఇబ్బందులు తొలగిపోతున్నాయి. పట్టిసీమ ద్వారా వస్తున్న గోదావరి జలాలతో కాలువల వెంట ఉన్న ఆయకట్టు భూముల్లో పోసిన నారుమళ్లను బతికించుకుంటున్నారు రైతులు. వర్షాలు సరిపడా లేక జీవం కోల్పోయిన వరినారు మళ్లకు పట్టిసీమ నీరు జీవం పోస్తోంది. సకాలంలో సాగునీరు కాలువలకు విడుదల చేస్తుండటంతో రైతులు మాగాణి సాగులో నిమగ్నమయ్యారు.

పూర్వవైభవం

కూటమి ప్రభుత్వం రాకతో పట్టిసీమకు పూర్వవైభవం వచ్చింది. 2014-19 మధ్య కాలంలో పట్టిసీమ నుంచి 263 టీఎంసీల సాగునీరు కృష్ణానదికి చేరాయి. ఐదేళ్లు సమృద్ధిగా సాగునీరు అందడంతో పంటలు బాగా పండాయి. 263 టీఎంసీల సాగునీరు రప్పించడం అంటే అది శ్రీశైలం పూర్తి నిల్వ సామర్థ్యం కంటే ఎక్కువ. తద్వారా శ్రీశైలం బ్యాక్‌వాటర్‌ను



కళకళలాడుతున్న నారుమడి

రాయలసీమకు మళ్లించి అక్కడి పంటలను కాపాడుకునేలా పట్టిసీమ దోహదపడింది. శ్రీశైలంలో 90 నుంచి 95 శాతం నీటిని నిల్వ చేసుకునేందుకు పట్టిసీమ ఎత్తిపోతల పథకం ఉపయోగపడుతుంది. ఎత్తిపోతల పథకం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు పట్టిసీమ ద్వారా 428 టీఎంసీలకు పైగా కృష్ణాడెల్టాకు తరలించారు. ఇది నాగార్జున సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం కంటే ఎక్కువ. పట్టిసీమకు రూ.1,300 కోట్లు ఖర్చు చేసి రూ.50 వేల కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

ఏటా 80 టీఎంసీలకు అవకాశం

ప్రతి సీజన్‌లో గోదావరి ద్వారా సముద్రంలో కలుస్తున్న వరద జలాల్లో 80 టీఎంసీలను పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణానదికి మళ్లించుకునే అవకాశం ఉంది. ఇప్పటి వరకు కేవలం రెండు టీఎంసీలు మాత్రమే రప్పించారు. సాగు, తాగునీటి అవసరాల మేరకు ఈపాటి అవసరమైన నీటిని ఎత్తిపోసి పంపేందుకు అధికారులు పూర్తి సన్నద్ధంగా ఉన్నారు.

రైతుల కళ్లల్లో ఆనందం

తమ పంటలను కాపాడేందుకు పట్టిసీమ ద్వారా వస్తున్న గోదారి జలాలను చూసి రైతుల ముఖాల్లో ఆనందం నెలకొంది. గత నాలుగు రోజుల క్రితం తమ గ్రామాల మీదుగా కృష్ణానదిలో కలిసేందుకు వెళుతున్న గోదావరి జలాలకు గ్రామ గ్రామానా పెద్ద ఎత్తున మహిళలు, రైతులు హారతులిచ్చారు. గోదావరి జలాలకు సారె సమర్పించారు.

అధిక దిగుబడులు

పట్టిసీమ ద్వారా వచ్చే గోదావరి జలాలతో మాగాణి సాగులో రైతులు అధిక దిగుబడులు సాధించారు. ఒకప్పుడు 30 నుంచి 40 బస్తాల దిగుబడి మించని పొలాలు సైతం ఏకంగా 50 నుంచి 60 బస్తాల దిగుబడినిచ్చాయి. దీంతో రైతులు నష్టాల నుంచి లాభాల బాట పట్టేందుకు పట్టిసీమ ఎత్తిపోతల పథకం ఎంతగానో ఉపయోగపడింది.

ప్రజాచైతన్యంలో మీడియా పాత్ర కీలకం

- పీఐబీ వర్క్‌షాప్‌లో కలెక్టర్ డీకే బాలాజీ



పీఐబీ నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

మచిలీపట్నం టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజలను చైతన్యపర్చడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ బాలా జీ అన్నారు. వలందపాలెం జి.కన్వెన్షన్‌లో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆధ్వర్యంలో వార్తలాప్ పేరుతో జర్నలిస్టులకు వర్క్‌షాప్ నిర్వహించారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రజల వద్దకు ప్రభుత్వ పథకాలు చేరేందుకు మీడియా ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో మీడియా నుంచి వచ్చే సమాచారం ప్రభుత్వానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తద్వారా లోటుపాట్లు సరి చేసుకునేందుకు వీలవుతుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా జిల్లాలో 16 మంది అనాథ పిల్లలను తల్లిదండ్రులకు దత్తత ఇచ్చామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరంలో జిల్లాలో సాధించిన అభివృద్ధిని పుస్తక రూపంలో తీసుకొచ్చామన్నారు. సూర్యఘర్ పథకాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లాలన్నారు. పీ-4 విధానం సమాజంలోని ఆర్థిక అసమానతలను తొలగించేందుకు, పేదలను ధనిక కుటుంబాలు దత్తత తీసుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ప్రయోజనాలను రైతులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మల్లవల్లి పారిశ్రామిక వాడలో 377 పరిశ్రమలకు భూకేటాయింపులు చేశామన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, నిష్పక్షపాతంగా పాత్రికేయులు పనిచేయా లన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వి.రామకృష్ణయ్య మాట్లాడుతూ, బలహీన వర్గాలకు ఉచిత న్యాయసేవలు అందిస్తామన్నారు. హిందూ లా కళాశాల ప్రిన్సిపాల్ రాయలు మాట్లాడుతూ, మీడియా చట్టాలు, భావ ప్రకటనా స్వేచ్ఛ, రాజద్రోహం, పరువు నష్టం తదితర చట్టాలను వివరించారు. పీఐబీ ఏడీ రమేష్ చంద్ర పీఐబీ కార్యకలాపాలను పవర్ పాయింట్‌పై వివరించారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, ప్రెస్ ఇన్ఫర్మేషన్ డైరెక్టర్ రత్నాకర్, ప్రసారభారతి సీనియర్ కరస్పాండెంట్ కె నవీన్‌కుమార్, జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి ఎం.వెంకటేశ్వరప్రసాద్, ప్రభాకర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం

సీపీఎస్ అమలు చేయాలి

- డీఎస్సీ-2003 ఉపాధ్యాయుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ శ్రీనాథ్ డిమాండ్

గుడివాడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం సీపీఎస్ అమలు చేయాలి డీఎస్సీ-2003 ఉపాధ్యాయుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ కె.ఎల్.శ్రీనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 16 రాష్ట్రాలకు చెందిన భారతీయ రైల్వే, తపాలా, సెంట్రల్ బెటాలియన్ ఫోర్స్ తదితర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించారని తెలిపారు. రాష్ట్రంలో మాత్రం పాత పెన్షన్ అమలుకు ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. దీనిపై డీఎస్సీ-2003 ఉపాధ్యాయుల రాష్ట్ర ఫోరం ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ముగ్గురు ఐఏఎస్ అధికారులకు గత ప్రభుత్వం పాత పెన్షన్‌ను పునరుద్ధరించారని గుర్తు చేశారు. ఒకే రాష్ట్రంలో అత్యున్నత హోదాలో ఉన్న అధికారులకు, దిగువ స్థాయి ఉద్యోగ, ఉపాధ్యాయులను వేరుగా చూడటం సబబు కాదని పేర్కొన్నారు. నూతన పెన్షన్ విధానం అమలు తేదీకి ముందు నోటిఫికేషన్‌లు విడుదలై నియామకం జరిగి సీపీఎస్ విధానంలో కొనసాగుతున్న 11,000 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణం స్పందించి రాష్ట్రంలోని 11,000 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం పాత పెన్షన్‌ను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 18వ తేదీన ఉమ్మడి జిల్లా కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించి జిల్లా కలెక్టర్‌లకు వినతిపత్రాలను అందజేయాలని పిలుపునిచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో 2004కు ముందు నోటిఫై చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని రాష్ట్ర కన్వీనర్ కె.ఎల్.శ్రీనాథ్ కోరారు.

కోళ్ల మేతగా కెర్నల్స్

- నెల్లూరు జిల్లా అధికారుల నిర్వాకం
- పాడైపోయిన ఫోర్టిఫైడ్ పౌష్టికాహారం
- బహిరంగ వేలానికి పౌరసరఫరాల శాఖ నిర్ణయం



గొల్లపూడి గోడౌన్‌లో కెర్నల్స్ బస్తాలు, రంగుమారి పాడైపోయిన కెర్నల్స్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

పౌష్టికాహారం అందించే లక్ష్యంతో ఫోర్టిఫైడ్ రైస్‌ను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. సాధారణ బియ్యంలో మినరల్స్ మల్టీ విటమిన్స్ ఉండే 'కెర్నల్స్'ను కలపడం ద్వారా ఫోర్టిఫైడ్ రైస్ సిద్ధం చేసి రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం అందిస్తోంది. అయితే, నెల్లూరు జిల్లా అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణలోపం కారణంగా పౌష్టికాహారం కలిగి ఉన్న బలవర్ధకమైన కెర్నల్స్ పనికిరాకుండా పోయాయి. బియ్యంలో కలపటానికి వీలు లేకుండా పాడైపోయాయి. ఈ విలువైన 'కెర్నల్స్'ను బియ్యంలో కలపటానికి మిల్లర్లకు అందిస్తే ప్రమాదమని గుర్తించిన ఎన్టీఆర్ జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ కార్యాలయం బహిరంగ వేలం పెట్టింది. మొత్తం 53.905 మెట్రిక్ టన్నుల మేర 'కెర్నల్స్' పాడైపోయాయి.

ఈ కెర్నల్స్ నెల్లూరు జిల్లా నుంచి అప్పట్లో గొల్లపూడి గోడౌన్‌కు పంపారు. 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కెర్నల్స్ నెల్లూరు జిల్లాలోనే నిల్వ ఉంచే క్రమంలో సరైన జాగ్రత్తలు తీసుకోలేదని ఉన్నతాధికారులు నిగ్గు తేల్చారు. నెల్లూరు జిల్లాలో గోడౌన్‌లో ఉండగానే ఈ కెర్నల్స్ పాడైపోయాయని చెపుతున్నారు.

పాడైపోయిన సమాచారం చెప్పకుండా చాలా తెలివిగా అక్కడి అధికారులు విజయవాడకు పంపించారని, గోడౌన్‌లో దిగుమతి చేసిన తర్వాత పగిలిన బస్తా నుంచి బయటకు వచ్చిన కెర్నల్స్ రంగు మారిపోయి ఉండటంతో అనుమానం వచ్చి మిగిలిన వాటిని పరిశీలించామన్నారు. మిగిలిన వాటిలో కూడా కెర్నల్స్ రంగు మారి ఉన్నాయన్నారు. కెర్నల్స్ తెల్లటి రంగుతో ఉంటాయి. రంగుమారాయంటే.. అవి పాడైపోయినట్టే నన్నారు. ఇలాంటివి బియ్యంలో కలిపితే పౌష్టికాహారం సంగతి దేవుడెరుగు, విషాహారంగా మారే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ విషయాన్ని సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ కార్యాలయ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సివిల్ సప్లయిస్ ఉన్నతాధికారులు దీనిపై విచారణ జరిపారు. నెల్లూరులోనే ఇవి పాడైపోయాయని ధ్రువీకరించారు. నెల్లూరు జిల్లా గోడౌన్ అధికారులు తేమ ప్రాంతంలో నిల్వ చేయటం వల్ల పాడైపోయినట్టుగా ప్రాథమికంగా తేలింది. నెల్లూరు జిల్లా అధికారుల నిర్వాకం కారణంగా జరిగిన నష్టాన్ని అక్కడి అధికారుల నుంచి రికవరీ చేసినట్టుగా తెలుస్తోంది. విజయవాడలో ఉన్న కెర్నల్స్ బస్తాలను వేలం వేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో ఎన్టీఆర్ జిల్లా సివిల్ సప్లయిస్ అధికారులు వీటిని వేలం వేస్తున్నట్టుగా బహిరంగ ప్రకటనను విడుదల చేశారు. పశువులు, కోళ్ల మేతగా అందించటానికి అవకాశం ఉండటంతో వీటిని కొనుగోలు చేయటానికి వ్యాపారులు పోటీ పడే అవకాశం కనిపిస్తోంది.

కాలుష్య రహిత ప్లాస్టిక్ ఉత్పత్తులు అవశ్యం



ప్లాస్టిక్, ప్యాకేజింగ్, ప్రింటింగ్ ఎక్స్‌పోలో ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కాలుష్య రహిత ప్లాస్టిక్ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులో తేవాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.

ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో సౌత్ ఇండియా ప్లాస్టిక్, ప్యాకేజింగ్, ప్రిం టింగ్ ఎక్స్‌పోను రాష్ట్ర 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్‌తో కలిసి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి మేలు చేసే ఎకో ఫ్రెండ్లీ ఉత్పత్తులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. పునర్వినియోగ, బయోడిగ్రేడబుల్, హానికారక రసాయనాలు లేని ఉత్పత్తులను ప్రోత్సహిస్తే మట్టి, నీరు, గాలి కాలుష్యం తగ్గుతుందన్నారు. ప్లాస్టిక్ సంచులకు బదులుగా జ్యూట్ బ్యాగులు, నైలాన్ బ్రష్‌లకు బదులుగా వెదురు బ్రష్ లు, రసాయన సబ్బుల స్థానంలో హెర్బల్ ఉత్పత్తులు వాడడం వల్ల ఆరోగ్యానికి, ప్రకృతికి మేలు జరుగుతుందన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుఎక్స్‌పోను సందర్శించి పర్యావరణహిత ఉత్పత్తులను తయారు చేసేందుకు ముందుకు రావాలని కోరారు. 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ ప్రకృతికి మేలు చేయడం అంటే మన జీవితానికి విలువ చేకూర్చడం అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరు గుర్తుపెట్టుకోవాలన్నారు. ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, వ్యాపారవేత్త కాకాని తరుణ్, హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.వి. స్వామి, వ్యాపార ప్రముఖులు పాల్గొన్నారు.

ఫసల్ బీమా యోజనను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్ లక్ష్మీశ

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వివిధ పంటలకు బీమా పరిహారం పొందేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజన (పీఎంఎఫ్‌బీవై), పునర్నిర్మించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్)ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. పీఎంఎఫ్‌బీవై, ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్‌లపై కలెక్టర్ లక్ష్మీశ, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. పీఎంఎఫ్‌బీవై అమలుకు టాటా ఏఐజీ ఇన్సూరెన్సు కంపెనీ, ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ అమలుకు ఇఫ్కో టోకియో జనరల్ ఇన్సూరెన్సు కంపెనీలను ఎంపిక చేశామన్నారు. బ్యాంకుల నుంచి పంట రుణం పొందిన రైతులకు రుణంతో పాటు విజ్ఞప్తి మేరకు బీమా ప్రీమియం కూడా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పంట రుణం తీసుకోని రైతులు కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీ), బ్యాంకుల్లో ప్రీమియం చెల్లించి, జాతీయ పంటల బీమా పోర్టల్‌లో నమోదు చేసుకొని పథకంలో చేవవచ్చన్నారు. నోటిఫై చేసిన పంటలు, బీమా మొత్తం, రైతులు చెల్లించాల్సిన ప్రీమియం, పథకంలో చేరేందుకు చివరి తేదీ తదితర వివరాలను తెలియజేయాలని అధికారులకు సూచించారు. వరికి ఎకరాకు రూ.42,500 పంట బీమా మొత్తం కాగా చెల్లించాల్సిన ప్రీమియం రూ. 850 అన్నారు. ఆగస్టు 15వ తేదీలోగా నమోదు చేయించుకోవాల్సి వుంటుందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్ తదితరులు హాజరయ్యారు.

జీవవైవిధ్యంగా రాజధాని అమరావతి



పచ్చదనం అభివృద్ధిపై జరిగిన వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఏడీసీ ఎండీ లక్ష్మీ పార్థసారథి

కలెక్టరేట్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : జీవవైవిధ్యంతో అలరారే విధంగా ప్రజా రాజధాని అమరావతిని నిర్మిస్తున్నామని అమరావతి అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరక్టర్ డి.లక్ష్మీపార్థసారథి పేర్కొన్నారు. రాజధాని అమరావతిలో పచ్చదనం అభివృద్ధిపై విజయవాడలోని హోటల్‌లో ఏడీసీ, ఏపీ సీఆర్‌డీఏ, వీఎంసీ, ఏపీ జీబీసీ, తాడేపల్లి - మంగళగిరి మున్సిపాలిటీల ఉద్యానవన అధికారులు, సిబ్బందికి శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. లక్ష్మీ పార్థసారథి మాట్లాడుతూ అతిసుందర రాజధాని నిర్మించడమే సీఎం నారా చంద్రబాబు సంకల్పం అన్నారు. ఆయన ఆలోచనలను సాకారం చేసేందుకు వర్క్‌షాపు ఏర్పాటు చేశామన్నారు. అమరావతిలో 320 కిలోమీటర్ల రోడ్డు వ్యవస్థను పచ్చదనంతో తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రభుత్వ భవనాలు, వివిధ నిర్మాణ సముదాయాలు వద్ద, రైతులకు తిరిగి ఇచ్చే 18 ఎల్పీఎస్ జోన్లలో సైతం పచ్చదనం, ఉద్యానవనాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. కొండవీటి వాగు, పాలవాగులకు ఇరువైపులా 100 నుంచి 150 మీటర్లతో బఫర్‌జోన్లను ఏర్పాటు చేస్తామన్నారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలో 22 కిలోమీటర్ల మేర బ్లూగ్రీన్ అభివృద్ధి చేస్తామన్నారు. డాక్టర్ స్మితా హెగ్డే మంగళూరు నగరంలో అధిక ఉష్ణోగ్రతలను తగ్గించడానికి చేపట్టిన సంస్కరణలను వివరించారు. ఎయిర్ పోర్టు ల్యాండ్ స్కేప్ డివిజన్ డీజీఎం శ్రీనివాస్, బయోలాజికల్ కంట్రోల్ ఆఫ్ పెస్ట్ నిపుణులు శరన్ గౌడ, ఎ.ఎస్.సుబ్బారావు, ఏడీసీ ఉద్యానవన అధికారులు వి.ఎస్.ధర్మజ, పి.విశ్వప్రసాద్ పలు అంశాలు వివరించారు. ఏపీ జీబీసీ ఎండీ కె.వి.శ్రీనివాసులు, ఏపీ సీఆర్‌డీఏ హార్టికల్చర్ డైరక్టర్ ఎం.హరిప్రసాద్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	103, 111, 122
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

కొండాలమ్మకు ఆషాఢ సారె

గుడ్లవల్లేరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : వేమవరంలో వేంచేసియున్న కొండాలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆషాఢమాస మహోత్సవాల సందర్భంగా శుక్రవారం అమ్మవారికి ఆషాఢ సారె(పట్టు వస్త్రాలు)ను వేమవరం గ్రామ సుహాసీనులు, వేమవరం గ్రామ సర్పంచ్ మన్నెం పద్మావతి ఆధ్వర్యంలో పసుపు బిందెలతో సారెను సమర్పించారు. అనంతరం కొండిపాలెం గ్రామ ఆడపడుచులు, సుహాసినీలు అమ్మవారికి సారెను సమర్పించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆషాఢ సారెను తీసుకువచ్చిన మహిళలు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పామర్రు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార సాధనలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. కొండిపర్రులోని శివాలయం ఫంక్షన్ హాల్లో శుక్రవారం ప్రగతి పథంలో పామర్రు అనే అంశంపై మండలస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో గ్రామ స్థాయి నాయకులను సమన్వయం చేసుకుని పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కరంలో ఎక్కడా ప్రజలనుంచి ఫిర్యాదులు రాకుండా అధికారులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని కోరారు.అర్హత గల ప్రతి నిరుపేద కుటుంబానికీ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు పూర్తిగా అందించే బాధ్యత అధికారులదేనన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా క్షేత్రస్థాయి అధికారులు ముందుకు సాగాలన్నారు. అన్ని శాఖల పురోభివృద్ధిని క్షుణ్ణంగా అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.జ్యోతి, తహసీల్దార్ జి.రవికాంత్, పీఆర్‌ఏఈ రామారావు, వ్యవసాయాధికారి వి.శివనాగరాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రావణి, విద్యుత్ శాఖ డీఈ సుందరరావు, ఎస్సైరాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

పామర్రు : పల్లె ప్రజల సమస్యల పరిష్కార సాధనే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. శుక్రవారం రాత్రి ఇందిరనగర్‌లో పల్లెనిద్రకు కార్యక్రమాన్ని నిర్వహించారు. కొండిపర్రు, ఇందిరా నగర్ ప్రాంతాల్లో పార్టీశ్రేణులు, అధికారులతో కలసి పాదయాత్ర చేసుకుంటూ ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. కొన్ని ప్రజా సమస్యలను అక్కడిక్కడే అధికారులుచేత పరిష్కర మార్గంచూపించారు. మండలంలో అధికారంలోకి వచ్చిన ఆరునెలలకాలంలో రూ.6కోట్లనిధులతో అంతర్గత రహదారులు నిర్మించామని వివరించారు. మరో రూ. 8కోట్లు నిధులు మంజూరైనట్లు కూమార్ రాజా తెలిపారు. అంతేకాకుండా నియోజకవర్గ కేంద్రమైన పామర్రులో ఎస్సీ విద్యార్థుల సౌకర్యార్థం సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాలు నిర్మించనున్నట్లు చెప్పారు. రెవెన్యూశాఖ అందిస్తున్న నూతన రేషన్‌కార్డులకు ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.అనంతరం ఎస్సీకాలనీలో ఎమ్మెల్యే పల్లెనిద్రకు ఎమ్మెల్యే ఉపక్రమించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గొట్టిపాటి లక్ష్మీదాసు, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర,ఈడేనాని, కొండిపర్రు గ్రామ టీడీపీ నేతలు నూకవరపు వీరాంజనేయులు, వెంకట్రామిరెడ్డి, మధు, మాజీ సర్పంచ్ విజయకుమార్, ప్రసాద్, గ్రామసర్పంచ్ పసుపులేటి రుక్మిణి, ఇందిర నగర్‌లోని 19 వార్డు సభ్యుడు రామంజనేయులు,పాల్గొన్నారు.



మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

గ్రామాల అభివృద్ధే కూటమి లక్ష్యం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, జూలై 11(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో సుపరిపాలన సాగుతుందని, సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగుతుందని ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యే వెనిగండ్ల రాములు అన్నారు. శుక్రవారం గుడ్లవల్లేరు మండలం వడ్లమన్నాడు, రెడ్డిపాలెం, వేమవరం గ్రామాల్లో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై పలువురు మహిళలతో మాట్లాడారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమం, చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ శాయన పుష్పావతి, మార్కెట్ యార్డు చైర్మన్ పొట్లూరి రవి, వేమవరం సర్పంచ్ మన్నెం పద్మావతి, మండల నాయకులు పోలవరపు వెంకట్రావు, సూరగాని ప్రసాద్, కొడాలి రామరాజు, కాగిత నరేంద్ర, శ్రీనివాసరావు, ఆండాళ్లు, పామర్తి కనకభాస్కరరావు, ఆకుల శివయ్య, దేవిశెట్టి రామకృష్ణ, ఎస్.ప్రసాద్, పాలేటి ఆంజనేయులు, సమ్మెట సాంబయ్య, దారా సత్యనారాయణ, ఈడే మోహన్, మన్యం నరసింహారావు, పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించి అభివృద్ధిపరచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావు పేర్కొన్నారు. శుక్రవారం వడ్లమన్నాడులో రూ.33లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం పాలకేంద్రం నూతన కమిటీని అభినందించారు. ఈ సందర్భంగా కొనకళ్ల మాట్లాడుతూ అభివద్ధికి దూరమైన జిల్లాలో కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో గ్రామాలభివృద్ధికి మంజూరైన నిధులను అరాచక ప్రభుత్వం పక్కదారి పట్టించిందని ఆరోపించారు. స్థానిక సంస్థలకు విలువలేకుండా చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ శాయన పుష్పావతి, మార్కెట్ యార్డు చైర్మన్ పొట్లూరి రవి, మండల నాయకులు పోలవరపు వెంకట్రావు, సూరగాని ప్రసాద్, కొడాలి రామరాజు, కాగిత నరేంద్ర, శ్రీనివాసరావు, ఆండాళ్లు, పామర్తి కనకభాస్కరరావు, ఆకుల శివయ్య, దేవిశెట్టి రామకృష్ణ, ఎస్.ప్రసాద్, పాలేటి ఆంజనేయులు, సమ్మెట సాంబయ్యపాల్గొన్నారు.



సుపరిపాలన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెనిగండ్ల ,ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

యుఎఫ్ఆర్‌టీఐ మండల కన్వీనర్‌గా మరీదు



తోట్లవల్లూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి) : యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఆర్టీఐ క్యాంపెయిన్(యుఎఫ్‌ఆర్‌టీఐ) తోట్లవల్లూరు మండల కన్వీనర్‌గా దేవరపల్లికి చెందిన మరీదు సాంబశివరావుని నియమించినట్టు ఆ శాఖ రాష్ట్ర కో కన్వీనర్ శ్రీనివాస గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కోసూరు పంచాయతీ కార్యదర్శిగా శ్రీలక్ష్మీ కృష్ణవేణి



కూచిపూడి: కోసూరు గ్రామపంచాయతీ కార్యదర్శిగా నెమలికంటి శ్రీలక్ష్మీ కృష్ణవేణి బాధ్యతలు చేపట్టారు. ఆమె ఘంటసాల మండలం చిట్టూర్పు గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధు లు నిర్వహిస్తూ కోసూరుకు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు కార్యదర్శిగా పని చేసిన ఎంఎస్ఎన్.మూర్తి ఎస్.ఎన్.గొల్లపాలేనికి బదిలీపై వెళ్లారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు సాధ్యం

● కాకర్ల మాధురి

పామర్రు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రవాస భారతీయులు అందిస్తున్న సహకరంతో విద్యార్థులు విద్యపరంగా మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శేషు ఎంప్లాయ్‌మెంట్ చారిటబుల్ ట్రస్టు ఎండీ కాకర్ల మాధురి అన్నారు. స్థానిక కంచర్ల రామారావు జడ్పీ హైస్కూ ల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మండలంలో ఏడుజిల్లా పరిషత్ హైస్కూల్స్ విద్యార్థులు 2025 ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రథమ,ద్వితీయ స్థానాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. వీరితో పాటు, తొమ్మిదో తరగతి వార్షిక పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచి ప్రస్తుతం అయా పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శేషు ఎంప్లాయ్‌మెంట్ చారిటబుల్ ట్రస్టు ఎండీ కాకర్ల మాధురి ప్రథమ బహుమతి రూ.25వేలు చొప్పున 7గురికి, రెండో బహుమతిగా రూ.18వేలు నగదును 7గురికి అందజేశారు. తొమ్మిదోతరగతిలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులైన 8మందికి రూ.15వేలు చొప్పున పామర్రు, కనుమూరు, నిమ్మకూరు, జమీదగ్గుమిల్లి, జమీగోల్వేపల్లి, పసుమర్రు, అడ్డాడ పాఠశాలల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులుగా చెక్కులను అందజేశారు. ఎన్నారై మాధురీ దాతృత్వాన్ని మెచ్చి సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది ఆమెను ఘనంగా సత్కరించారు. శేషు ఎంప్లాయ్‌మెంట్ కేర్ ట్రస్టు సభ్యులు దమయంతి మాధవి, రాధిక, యోగ్యత, బలరామమూర్తి, శివశంకర్, పామర్రు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఎం.శ్రీనివాసరావు, పాల్గొన్నారు.



నగదు ప్రోత్సాహాన్ని పొందిన విద్యార్థులతో మాధురి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి

● పీహెచ్‌సీ వైద్యాధికారిణి దీప్తి

గుడివాడ రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వ్యాధులు రాకుండా గ్రామాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మోటూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి దీప్తి అన్నారు. శుక్రవారం మోటూరు, బొమ్ములూరు గ్రామాల్లో ఫ్రైడే సందర్భంగా ఇంటింటికీ తిరిగి మలేరియా, డెంగ్యూ వంటి అంటువ్యాధులు ఏ విధంగా ప్రబలుతున్నాయో, వాటి నివారణ చర్యల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వైద్యురాలు దీప్తి మాట్లాడుతూ నిల్వ ఉన్న కుండీలు, టైర్లు, డ్రెయినేజీల్లో దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. ప్రతి శుక్రవారం 50 ఇళ్లు తిరిగి అంటువ్యాధులు రాకుండా నివారణ చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి ఆమె సూచించారు. ప్రజలను ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి ఇంటిలో ప్రాథమిక కిట్లు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఏదైనా జ్వరం, దగ్గు వస్తే వెంటనే ప్రథమ చికిత్సలకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా మోటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నిల్వ నీళ్లు పారబోయిస్తున్న వైద్యాధికారి దీప్తి

వంతెన నిర్మాణంతో తీరిన కష్టాలు

పమిడిముక్కల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) :ముళ్లపూడి డ్రెయిన్‌పై నూతనంగా వంతెన నిర్మాణం పూర్తికావడంతో వేల్పూరు, ముళ్లపూడి తదితర గ్రామాల రైతులు, ప్రజల కష్టాలు తీరాయని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. వేల్పూరు - కనుమూరు రోడ్డులో ముళ్లపూడి డ్రెయిన్‌పై రూ. 93లక్షల ఎస్‌డీఎంఎఫ్ నిధులతో నిర్మించిన వంతెనను శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ముళ్లపూడి డ్రైన్‌వంతెకూలిపోయి రైతులు వ్యవసాయ ఉత్పత్తులు రవాణా చేసుకునేందుకు, వేల్పూరు, పరిసర గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బంది కరంగా ఉన్నప్పటికి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు కలుగుతున్న అసౌకర్యం గమనించి నూతన వంతెనిర్మాణానికి నిధులు మంజూరు చేయించి నిర్మాణం పూర్తిచేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు జక్కా శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బి ఏఈ మల్లిఖార్జునరావు, జడ్పీటీసీ వెంకటరమణ కుమారి, వైస్ ఎంపీపీ మహేశ్, సర్పంచ్ రత్నం దిలీప్‌కుమార్, అబ్బాస్, కొల్లూరి బాబ్జి, మైనేని నరేంద్ర పాల్గొన్నారు.



ముళ్ళపూడి డ్రెయిన్‌పై నిర్మించిన వంతెన

మొక్కల పెంపకంపై అవగాహన తప్పనిసరి

● హెచ్ఎం వి.మణి

నందివాడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుండే మొక్కలు పెంచటం అలవాటు చేసుకోవాలని, అదేవిధంగా చదువు పట్ల శ్రద్ధ కలిగి ఉండాలని పోలుకొండ జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.మణి అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన మెగా పీటీఎం 2.0 కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధతోపాటు మొక్కలు పెంపకంపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచి చదువు ఎంత ముఖ్యమో మొక్కలు పెంపకం కూడా అలవాటు చేసుకుంటే పెద్దయిన తర్వాత కూడా మొక్కలు పెంపకం తోటి వారికి సహాయం చేయటంతోపాటు మంచి బుద్దులు అబ్బుతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మొక్కలు అందజేసి ఒక్కొక్కరు మొక్కను మూడు సంవత్సరాల వరకు మొక్కలను సంరక్షించాలని కోరారు. నందివాడ, పుట్టగుంట, తుమ్మలపల్లి, లక్ష్మీనరసింహపురం, పోలుకొండ, తమిరిశ, రుద్రపాక పలు గ్రామాల పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు మొక్కలు, పుస్తకాలను అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మొక్కలు అందజేస్తున్న నేతలు



శిక్షణా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో సుహాసిని

వస్త్రాల తయారీ శిక్షణా కేంద్రం పరిశీలన

కూచిపూడి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి నాట్యంలో వినియోగించే స్థానిక డ్వాక్రా మహిళలు తయారు చేస్తున్న దుస్తులను శుక్రవారం మొవ్వ ఎంపీడీవో సుహాసిని పరిశీలించారు. కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ ఆదేశాలతో డీఆర్‌డీఏ పీడీ పర్యవేక్షణలో కూచిపూడి సెంటర్‌లో కొనసాగుతున్న టైలరింగ్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న డ్వాక్రా మహిళల నుంచి వివరాలు సేకరించి పలు సూచనలు చేశారు. ఈ దుస్తుల తయారీకి మండలంలో 20 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తున్నారు. మహిళలకు పాఠశాలల్లో యూనిఫామ్ కుట్టేందుకు అవకాశం కల్పిస్తామని ఎంపీడీవో తెలిపారు.

పేదరికం లేని సమాజమే పీ4 లక్ష్యం

గుడ్లవల్లేరు : పేదరికం లేని సమాజమే లక్ష్యంగా పీ4 సర్వే నిర్వహిస్తున్నామని ఎంపీడీవో ఇమ్రాన్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పీ4 మార్గదర్శి - కుటుంబ సర్వేపై ఎంపీడీవో యమ్.డి ఇమ్రాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల వారీగా ఇప్పటికే దత్తత తీసుకున్న కుటుంబాలు, దత్తత తీసుకోవలసిన కుటుంబాలకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మార్గదర్శి నిబద్ధతతో తమ బాధ్యతలను నిర్వర్తించి, ఆయా కుటుంబాలను అన్ని విధాలుగా ప్రోత్సహించి బంగారు కుటుంబంగా మార్చేందుకు కృషి చేయాలన్నారు.

ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్

గుడివాడ : నెంబరు ప్లేట్, హెల్మెట్ ధరించని ద్విచక్రవాహనదారులకు స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దమ్ము ట్రాక్టర్లతో రహదారులు ధ్వంసం

కూచిపూడి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): దమ్ము ట్రాక్టర్లతో రహదారులు ఛిద్రమవుతున్నాయి. ఖరీఫ్ నాట్లు ప్రారంభం కావటంతో పొలాల్లో దమ్ము పనులు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. పొలాల వద్ద బిగించాల్సిన దమ్ము చక్రాలను ముందుగానే బిగించి రహదారుల వెంట ప్రయాణించటం వల్ల రహదారులు ఛిద్రమవ్వటమే కాకుండా చక్రాలకు ఉన్న బురదమట్టి రోడ్లపై పడి ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మొవ్వ, కూచిపూడి, కారకంపాడు, భట్లపెనుమర్రు, పెదపూడి, పెడసగనల్లు, పెదముత్తేవి తదితర గ్రామాల్లో ఖరీఫ్ నాట్లు ప్రారంభం కావటం వల్ల ఆయా గ్రామాల్లోని పొలాలను దమ్ము చేస్తున్నారు. దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రోడ్లపై తిరగకుండా పొలాల వద్దే దమ్ము చక్రాలు బిగించుకునేలా ట్రాక్టర్ యాజమానులు, రైతులు చర్యలు చేపట్టినట్లైతే ప్రమాదాలు జరిగే అవకాశం తగ్గుతుంది. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



దమ్ము చక్రాలతో రోడ్లపై ప్రయాణిస్తున్న ట్రాక్టర్

స్మార్ట్‌మీటర్లను బిగించొద్దు : సీపీఎం

గుడివాడ, జూలై 11(ఆంధ్రజ్యోతి) : ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అదానీ స్మార్ట్‌మీటర్‌లను వ్యతిరేకించి నేడు అధికారంలోకి రాగానే బిగించడం దారుణమని, స్మార్ట్‌మీటర్లు బిగింపు ఆపేవరకు ఉద్యమం చేపడతామని సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక జగనన్న కాలనీలో అదానీ కంపెనీ ఉద్యోగులు తాళం వేసి ఉన్న ఇళ్ళకు, కట్టడం పూర్తికానీ ఇళ్ళకు బలవంతంగా స్మార్ట్‌మీటర్‌లను బిగించడాన్ని శుక్రవారం సీపీఎం నాయకులు అడ్డుకున్నారు. కాలనీలోని విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు పి.రజిని, లంకా సురేంద్ర, రేపాని కొండ, బండి శ్రీను, శొంఠి వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

పోలుకొండలో పల్లె నిద్ర

నందివాడ : పోలుకొండ సెంటర్‌లో సీఐ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ సోమేశ్వరరావు మాట్లాడుతూ ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు ఆదేశాల మేరకు గంజాయి, సైబర్ నేరాలు, వివిధ దొంగతనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్సై కె.శ్రీనివాస్, సర్పంచ్ ఝాన్సీకుమారి పాల్గొన్నారు.

మోపర్రులో ఇంటింటి సర్వే

పెదపారుపూడి : వెంట్రప్రగడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మోపర్రు హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనిటీ మెడిసిన్ గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ నుంచి డాక్టర్ పి.సత్యనారాయణ చౌదరి అసిస్టెంట్ ప్రొఫెసర్ అండ్ టీం బృందం వారు గ్రామంలో అసంఘటిత, సంఘటిత వ్యాధుల మీద సర్వే ఇన్వాల్యుయేషన్ క్వాలిటీని పరీక్షించుటకు శుక్రవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. గ్రామంలోని ఆశాలు, ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్‌వైజర్లు డాక్టర్ సందీప్, పాల్గొన్నారు.

బోరు పంపు పనుల ప్రారంభం

పమిడిముక్కల : తాడంకిలో మండల పరిషత్ నిధులు రూ. 3ల క్షలతో చేపట్టిన తాగునీటి బోరు పంపు పనులను సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, జడ్పీటీసీ ఏనుగ వెంకటరమణకుమారి, ఎంపీటీసీ కూచిపూడి శ్రీలక్ష్మి, మాజీ సర్పంచ్ జక్కా శ్రీనివాసరావువు ప్రారంభించారు. గ్రామంలో పాత బోరు పనిచేయక పోవడంతో కొత్తబోరు వేయవలసి వచ్చిందని చర్చి, టవర్ బజారులో ట్యాంకరు ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని, మూడు రోజుల్లో బోరు అందుబాటులోకి వస్తుందని కార్యదర్శి భవాని తెలిపారు.

చికిత్స పొందుతూ హెడ్‌కానిస్టేబుల్ మృతి

గుడివాడ, జూలై 11(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 9వ తేదీన స్థానిక వీకెఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన నందివాడ ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ చల్లగుళ్ల వెంకటేశ్వరరావు విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ ఎస్సై పి.గౌతమ్‌కుమార్ తెలిపారు.

ఉచిత క్యాన్సర్ పరీక్షలు

పెదపారుపూడి : పెదపారుపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి సహకారంతో భారత ఎలక్ట్రానిక్స్ సీఎస్ఆర్ నిధులతో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు అడ్వాన్స్ మొబైల్ డయాగ్నోస్టిక్ వాహనం వైద్యులు డాక్టర్ హారిక రేడియాలజిస్ట్, డాక్టర్ వర్షిణి సుమారు 150 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేనట్లు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శ్రావిక శుక్రవారం తెలిపారు. రేడియో గ్రాఫర్ ప్రభాకర్, ల్యాబ్ టెక్నీషియన్ శివప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తల సమావేశం నేడు

గుడివాడ : ఈ నెల 12వ తేదీన గుడివాడ మండలం లింగవరంలోని కె-కన్వెన్షన్ హాల్‌లో రీకాలింగ్ చంద్రబాబు, బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీపై నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు వైసీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను అన్నారు. శుక్రవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడిని తీసుకువచ్చేందుకు రీకాలింగ్ చంద్రబాబు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పెయ్యల ఆదాం, పాలేటి చంటి, విక్టర్, నారాయణరెడ్డి, కొంకితల ఆంజనేయప్రసాద్, చుండూరి శేఖర్, అడపా పండు, చింతాడి నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	103, 111, 122
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

శాకంబరిగా లంకమ్మ దర్శనం రేపు

అవనిగడ్డ, జూలై 11(ఆంధ్రజ్యోతి): లంకమ్మ అమ్మవారిని ఆదివారం శాకంబరిగా అలంకరిస్తామని ఈవో వై.శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కూటమి నేతలు అమ్మవారిని దర్శించుకుంటారని, అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

అన్నదాత సుఖీభవకు 2,636 మంది రైతులు అర్హులు

అవనిగడ్డ రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని 2,636 మంది రైతులను అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులుగా గుర్తించామని ఏవో శుభహారిక తెలిపారు. అర్హత ఉన్నవారు రైతుసేవా కేంద్రాల్లో వివరాలు నమోదు చేయించుకోవాలని ఆమె సూచించారు. ఇప్పటివరకు 36 దరఖాస్తులు అందాయని తెలిపారు.

ఎనిమిది లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల
మరమ్మతులకు రూ.2.45 కోట్లు

- పదేళ్లపాటు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌కు రూ.56.88 కోట్లు
- ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం: ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ, జూలై 11(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ప్రభుత్వ గత ఐదేళ్లలో రైతులకు ఉపయోగపడే లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను నిర్లక్ష్యంగా వదిలేసింది. కూటమి ప్రభుత్వం రాకతో వాటికి పునరుత్తేజం రాబోతోంది. నియోజకవర్గంలో 8,679 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే ఎనిమిది లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల మరమ్మతులకు రూ.2.45 కోట్లు, పదేళ్ల పాటు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌కు రూ.56.88 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించాం.' అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏపీఎస్ఐడీసీ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.చెన్నారెడ్డితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కోడూరు మండలం ఉల్లిపాలెంలో 850 ఎకరాలకు సాగునీరందించే లిఫ్ట్ ఇరిగేషన్ పథకం మరమ్మతులకు రూ.28 లక్షలు, పదేళ్లపాటు ఓ అండ్ ఎం పనులకు రూ.5.70 కోట్లు, అవనిగడ్డ మండలం బందలాయిచెరువులో 235 ఎకరాలకు నీరందించే పథకం మరమ్మతులకు రూ.42 లక్షలు, ఓ అండ్ ఎం పనులకు రూ.2.45 కోట్లు, అవనిగడ్డలో 665 ఎకరాలకు నీరందించే పథకం మరమ్మతులకు రూ.40 లక్షలు, ఓ అండ్ ఎం పనులకు రూ.4.57 కోట్లు, పులిగడ్డలో 530 ఎకరాలకు నీరందించే పథకం మరమ్మతులకు రూ.14 లక్షలు, నిర్వహణకు రూ.3.64 కోట్లు, దక్షిణ చిరువోలులంకలో 675 ఎకరాలకు నీరందించే పథకం మరమ్మతులకు రూ.41 లక్షలు, నిర్వహణకు రూ.4.63 కోట్లతో ప్రతిపాదనలు పంపామని ఆయన తెలిపారు. చల్లపల్లి మండలం మాజేరులో 1,224 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే లిఫ్ట్ ఇరిగేషన్ పథకం మరమ్మతులకు రూ.6.50 లక్షలు, పదేళ్లపాటు నిర్వహణకు రూ.7.70 కోట్లు, నాగాయలంక మండలంలో 3 వేల ఎకరాలకు సాగునీరందించే అడవిపాలెం పంపింగ్ స్కీం మరమ్మతులకు రూ.33 లక్షలు, నిర్వహణకు రూ.18.50 కోట్లు, 1500 ఎకరాలకు సాగునీరు అందించే రాజు కాల్వ పంపింగ్ స్కీమ్ మరమ్మతులకు రూ.41 లక్షలు, నిర్వహణకు రూ.9.69 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ షేక్ అన్వర్ పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలకు
మేలు జరిగేలా చూడండి

- అధికారులతో నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబు



మాట్లాడుతున్న నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబు

ఘంటసాల, జూలై 11(ఆంధ్రజ్యోతి): పీ4 కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాలకు మేలు జరిగేలా చూడాలని అధికారులకు నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.సాయిబాబు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయానికి విచ్చేసిన ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బంగారు కుటుంబాల అభివృద్ధికి ప్రత్యేకమైన మార్గదర్శకాలు సూచించిందని, గ్రామంలో ఆర్థికంగా అభివృద్ధి చెందిన వారిని గుర్తించి పేద వర్గాల అభ్యున్నతికి సహాయ పడేలా అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. చినకళ్లేపల్లి, వేములపల్లి గ్రామాల్లో బంగారు కుటుంబాలను పది మంది మార్గదర్శులు దత్తత తీసుకునేందుకు చొరవ చూపిన గ్రామ కార్యదర్శులు అబ్దుల్ నయీమ్, ఆర్.శ్రీనివాస్, వీఆర్వో మనీషాను సత్కరించారు. ఎంపీడీవో సుబ్బారావు, తహసీల్దార్ విజయప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గోవుల సంతతి అభివృద్ధికి బుల్ సెమన్ పంపిణీ



బుల్ సెమన్‌ను గోపాలమిత్రలకు అందిస్తున్న శ్రీమంతురాజా యార్లగడ్డ రామేశ్వరప్రసాద్

చల్లపల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): గోవుల సంతతిని అభివృద్ధి చేసేందుకు చల్లపల్లి రాజా మనుమలు శ్రీమంతురాజా యార్లగడ్డ రామేశ్వరప్రసాద్, హరీశ్వరప్రసాద్‌లు శుక్రవారం బుల్ సెమన్ (ఎద్దుల వీర్యం)వైల్స్‌ను గోపాలమిత్రలకు ఉచితంగా అందజేశారు. ఇటీవల కన్నుమూసిన చల్లపల్లి రాజా కుమారుడు, మాజీ ఎంపీ యార్లగడ్డ అంకినీడుప్రసాద్ బహద్దూర్ జ్ఞాపకార్థం రూ.30వేల విలువైన 300 బుల్ సెమన్లను వీరవల్లి నుంచి తీసుకొచ్చి రాజాకోటలో చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి, మచిలీపట్నం, అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాలకు చెందిన గోపాలమిత్రలకు రామేశ్వరప్రసాద్ పంపిణీ చేశారు. గోవుల సంతానోత్పత్తికి దోహదపడేలా తమ తండ్రి దశదిన కార్యక్రమం రోజున అచ్చువేసిన ఆంబోతును గ్రామానికి సమర్పించే ఆనవాయితీ ఉంటుందని తెలిపారు. ఆంబోతును గ్రామానికి ఇచ్చినా బాగోగులు పట్టించుకునే పరిస్థితులు లేనందున ఉచితంగా సెమన్‌ను అందిస్తున్నామన్నారు. రావి రాజు, అడపా రవి, బొందలపాటి వీరబాబు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ల తనిఖీలు

నాగాయలంక, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఉయ్యూరు ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.కృష్ణనాయక్ ఆధ్వర్యంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు, సిబ్బంది 27 బృందాలుగా ఏర్పడి శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ వినియోగదారుల మీటర్లను తనిఖీలు చేశారు. 2,371 గృహాలు, 152 వాణిజ్య సర్వీసులు, 21 ఆక్వా సర్వీసులను తనిఖీ చేశారు. అందులో 307 మీటర్లు అదనపు లోడుగా ఉన్నట్లు గుర్తించి రూ.7,60,000 అపరాధ రుసుమును విధించారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ డీఈఈ ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, నాగాయలంక ఏఈ జి.వెంకటరాజు, విజిలెన్స్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సదస్సు నిర్వహణ స్ఫూర్తిదాయకం



పుస్తకావిష్కరణ చేస్తున్న కాలేజీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత్ గుప్తా, ప్రిన్సిపాల్ ఉమాదేవి

అవనిగడ్డ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థాయిలో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించటం స్ఫూర్తిదాయకమని డైరెక్టర్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్ డాక్టర్ నారాయణ భరత్ గుప్తా అన్నారు. శుక్రవారం అవనిగడ్డలో అర్థశాస్త్ర విభాగం, ఆంధ్రప్రదేశ్ అర్థశాస్త్ర అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ సదస్సులో పరిశోధనా పత్రాల పుస్తక సంకలనం ఫిషరీస్ ఏ పొటెన్షియల్ వెకేషన్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు ఆంధ్రప్రదేశ్‌ని భరత్ గుప్తా ఆవిష్కరించారు. పుస్తక సంపాదకులు వీరకుమారి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

బందరులో భారీ వర్షం

జలమయమైన రోడ్లు

మచిలీపట్నం టౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయమయ్యాయి. డ్రెయిన్లు పొంగి పొర్లాయి. బైక్ సైలెన్సర్లలోకి నీరు వెళ్లి వాహనదారులు నానాపాట్లు పడ్డారు. రోడ్ల పక్కన కూరగాయలు అమ్ముకునే చిరు వ్యాపారులు ఇబ్బంది పడ్డారు.





గొడుగుపేటలోని రోడ్డు, బస్టాండ్ వైపు నుంచి కోనేరుసెంటర్ వెళ్లే ప్రధానరోడ్డుపైన భారీగా చేరిన నీరు

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసింది కొల్లు రవీంద్రే

- పేర్ని కుటుంబ మూడు తరాల రాజకీయంలో బందరుకు చేసిందేమిటి?: టీడీపీ నగర అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి
- పేదల బియ్యం బొక్కిన పేర్ని నానీ, కిట్టూ నీతులు చెప్పడం హాస్యాస్పదం: నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ ఖాజా

మచిలీపట్నం టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధి మంత్రి కొల్లు రవీంద్ర హయాంలోనే జరిగిందని టీడీపీ నగర అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. పేర్ని కుటుంబ మూడు తరాల రాజకీయంలో బందరుకు చేసిందేంటని ఆయన ప్రశ్నించారు. గతంలో నగరంలో ఏడు తాగునీటి రిజర్వాయర్లుండగా, కొల్లు రవీంద్ర హయాంలో అదనంగా 8 రిజర్వాయర్లు నిర్మించారన్నారు. 2014-19 మధ్య మచిలీపట్నం అభివృద్ధికి రూ.64 కోట్ల 90 లక్షలు వెచ్చించారన్నారు. కూటమి ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు స్వీకరించాక 15 అడుగుల మేర పంపుల చెరువులో పేరుకుపోయిన సిల్టును తొలగించారన్నారు. మంత్రి నారా లోకేశ్‌ను వైసీపీ నాయకులు మర్యాదలేకుండా, తక్కువ చేసి మాట్లాడటం సరికాదని నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ ఖాజా హెచ్చరించారు. పేదల బియ్యం బొక్కేసిన మాజీ మంత్రి పేర్ని నానీ, ఆయన కుమారుడు కిట్టూలు నీతులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. వైసీపీ హయాంలో గంజాయి బ్యాచ్‌లతో గంజాయి అమ్మించారని, జనసేన నేతలపై దాడులు జరిపారని, పోలీసులను బెదిరించారని రైతు సంఘ నియోజకవర్గ కార్యదర్శి పామర్తి లక్ష్మణ్ విమర్శించారు.



చిలంకుర్తి పిచ్చేశ్వరరావును సత్కరిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ

రైతులకు మెరుగైన సేవలందించండి

- ఏఎంసీ వైస్ చైర్మన్ పిచ్చేశ్వరరావుతో డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలందించాలని మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్‌గా ఎంపికయిన చిలంకుర్తి పిచ్చేశ్వరరావుకు డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ సూచించారు. శుక్రవారం జనసేన పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో పిచ్చేశ్వరరావును బండి రామకృష్ణ సత్కరించారు. మార్కెట్ యార్డు అభివృద్ధికి సమర్థవంతంగా పనిచేయాలని ఆయన సూచించారు. గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె

మచిలీపట్నం టౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ఆలయాల్లో శుక్రవారం అమ్మవార్లకు మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. రామలింగేశ్వరస్వామి దేవాలయంలో పర్వతవర్ధని అమ్మవారికి పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చి సారె సమర్పించారు. ఆలయ ఈవో ఎస్.ఆంజనేయస్వామి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. రంగనాయకస్వామి దేవాలయంలో శ్రీదేవి అమ్మవారికి మహిళలు సారె సమర్పించారు. గరుడ సేవా సమితి ఆధ్వర్యంలో చిట్టి కుమారి నేతృత్వంలో పురవీధుల్లో ఊరేగింపుగా సారె తీసుకొచ్చారు.



మచిలీపట్నం రామలింగేశ్వరస్వామి ఆలయంలో పర్వతవర్ధని అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

భావదేవరపల్లిలో అన్నపూర్ణ అమ్మవారికి..

నాగాయలంక: భావదేవరపల్లిలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలోని అమ్మవారికి శుక్రవారం భక్తులు, గ్రామస్థులు ఆషాఢ సారెను సమర్పించారు. గొడవర్తి లీలా శివకుమార్, అర్జా ఉదయభాస్కర్ దంపతులు మేళతాళాలతో సారెను తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయ అర్చకుడు ఆకెళ్ల దేవనాథ్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త పూషడపు నిరంజనరావు పర్యవేక్షించారు.

బొర్రా సుధాకర్ మృతికి సంతాపం

- వాయిదా పడిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశం



సంతాపం తెలుపుతున్న మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నం టౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మాజీ కౌన్సిలర్ బొర్రా సుధాకర్ మృతి చెందడంతో శుక్రవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం వాయిదాపడింది. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఐదు అంశాలను ప్రవేశపెట్టే అజెండాను రూపొందించారు. కానీ, మాజీ కౌన్సిలర్ బొర్రా సుధాకర్ మృతితో సమావేశం వాయిదా వేస్తూ తీర్మానించారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్లు శీలం భారతి, మాడపాటి విజయలక్ష్మితో పాటు టీడీపీ కార్పొరేటర్లు మరకాని సమతాకీర్తి, చిత్తజల్లు నాగరాము, అన్నం ఆనంద్, దేవరపల్లి అనిత, దింటకుర్తి సుధాకర్, జనసేన కార్పొరేటర్ పినిశెట్టి ఛాయాదేవి, కమిషనర్ బాపిరాజు, అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, వైసీపీ కార్పొరేటర్లు సంతాపం తెలిపారు. ఐదో అంశంగా పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణం ఎన్వోసీ కోసం ప్రవేశపెట్టే ఐదో తీర్మానంపై ఉత్కంఠ ఉన్న నేపథ్యంలో సమావేశం వాయిదా పడటంతో రాజకీయ పార్టీల నాయకులు ఊపిరి పీల్చుకున్నారు.

తీరప్రాంత గ్రామాలకు తాగునీటి సరఫరా



చింతకోళ్లలో ట్యాంకర్ నుంచి తాగునీరు పట్టుకుంటున్న గ్రామస్థులు

కోడూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): తాగునీటికి ఇబ్బంది పడుతున్న తీర గ్రామాల ప్రజలకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో తాగునీరు అందిస్తున్నారు. శుక్రవారం చింతకోళ్ల గ్రామస్థులకు 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటరు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేశారు. మండలి ఫౌండేషన్ ద్వారా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని మండలి వెంకట్రామ్ పర్యవేక్షించారు.

తహసీల్దార్ విజయప్రసాద్‌కు అభినందన

గూడూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): గతంలో గూడూరులో పనిచేసిన తహసీల్దార్ బి.విజయప్రసాద్‌కు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ తరఫున గవర్నర్ అబ్దుల్ నజీర్ సిల్వర్ మెడల్ అందించిన సందర్భంగా మండల వీఆర్వోల సంఘ అధ్యక్షుడు పినిశెట్టి కాకుళేశ్వరరావు, కార్యదర్శి ఎండీ బషీర్, వీఆర్వోలు అభినందనలు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ తరఫున 2022-23లో గూడూరు తహసీల్దార్‌గా పనిచేసిన విజయప్రసాద్ అత్యధిక సభ్యత్వాలు, నిధులు సేకరించినందుకు ఈ అవార్డు అందుకున్నట్టు వారు తెలిపారు.

వాడపాలెంలో సామూహిక కుంకుమార్చన

మచిలీపట్నం టౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం బందరు మండలం వాడపాలెం గ్రామంలోని కోదండ రామాలయంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచార పరిషత్ జిల్లా ప్రతినిధి తురగా ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలకు అమ్మవారి ప్రతిమలు, కంకణాలు, ఆధ్యాత్మిక పుస్తకాలు, పసుపు, కుంకుమలు అందజేశారు. అర్చకస్వామి విజయకుమార్, దేవస్థానం కమిటీ సభ్యులు శివకుటుంబరావు, రాజ్‌కుమార్, నాగేశ్వరరావు, నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా పైడమ్మ



పెడన, జూలై 11(ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత పైడమ్మ అమ్మవారు శుక్రవారం శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో జి.వి.కృష్ణారావు పర్యవేక్షణలో అమ్మవారిని కాయగూరలు, పండ్లు, ఆకుకూరలు, పచ్చని ఆకులతో శాకంబరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శాకంబరీదేవి అలంకారంలో ఉన్న పైడమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. తోట రామారావు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు. అమ్మవారికి అలంకరించిన కూరగాయలు, ఆకుకూరలతో తయారు చేసిన కదంబ ప్రసాదాన్ని ఆదివారం భక్తులకు పంపిణీ చేస్తామని ఈవో తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు

- హోమ్‌గార్డు వేణుగోపాలరావు అదృశ్యంపై కేసు



హోమ్‌గార్డు ఆకుల వేణుగోపాలరావు

మచిలీపట్నం టౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): తండ్రి మృతిచెందడంతో మానసిక ఒత్తిడికి గురయిన ఇనకుదురుకు చెందిన హోమ్‌గార్డు ఆకుల వేణుగోపాలరావు బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఇనకుదురు సీఐ పరమేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. వేణుగోపాలరావు ద్విచక్రవాహనం మంగినపూడి సముద్ర తీరం వద్ద గురువారం సాయంత్రం గుర్తించారు. ఇనకుదురు పోలీసులు వేణుగోపాలరావు కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. మిస్సింగ్ కేసు నమోదు చేశామని, వివరాలు తెలిస్తే ఇనకుదురు సీఐ 83329 83788, ఎస్సై 94407 96414లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు శుక్రవారం సూచించారు.

గిలకలదిండి ఉప్పునీటి కాలువ వద్ద
గుర్తుతెలియని మృతదేహం



మచిలీపట్నం టౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): గిలకలదిండి ఉప్పునీటి కాలువ వద్ద శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని మృత దేహాన్ని రూరల్ పోలీసులు గుర్తించారు. బందరు తాలూకా ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో మృతదేహం ఎవరిది అని ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వాస్పత్రికి శవ పరీక్ష నిమిత్తం పంపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతిచెందిన వ్యక్తి వివరాలు తెలియలేదని, శుక్రవారం ఉదయం మృతిచెంది ఉంటాడని ఎస్సై తెలిపారు.

మండలిపురంలో 104 వైద్యసేవలు

అవనిగడ్డ రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలిపురంలో డాక్టర్ రియాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం 104 వైద్యసేవలను నిర్వహించారు. 71 మందికి రక్తపోటు, మధుమేహ పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందించారు. టీబీ వ్యాధి నివారణపై అవగాహన కల్పించే కరపత్రాలను సూపర్‌వైజర్ శ్రీనివాసరావు ఆవిష్కరించారు.



వీరభద్రపురంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

కూటమి ప్రభుత్వానికి అండగా నిలవండి

- ప్రజలతో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలిచి ఆదరించాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ కోరారు. పట్టణంలోని వీరభద్రపురం(7వ వార్డు)లో శుక్రవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలు అందించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, నాయకులు హన్ను, కమ్మగంటి బాబు, తమ్మా భీమయ్య, వీణం శ్రీనివాస్, సమతం గంగాధరరావు, పరసా సూర్యనారాయణ, ఎలిగట్ల ప్రసాద్, పరసా జితేంద్ర, గఫార్, యర్రా నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం



పెదతుమ్మిడిలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

బంటుమిల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ జనాభా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బంటుమిల్లి ప్రభుత్వ డిగ్రీ కాళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జనాభా పెరుగుదల, వనరుల కొరత, పర్యావరణ ప్రభావంపై చర్చించారు. ప్రిన్సిపాల్ జగన్మోహనరావు పాల్గొన్నారు. పెదతుమ్మిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కెసువర్చల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కాలేజీ అధ్యాపక బృందం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘంటసాలలో ర్యాలీ

ఘంటసాల: ప్రపంచ జనాభా దినోత్సవ అవగాహన ర్యాలీని ఘంటసాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ వేమూరి ప్రమోద్‌కుమార్, వెంకటేశ్వర్లు గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యవంతమైన జీవన విధానం అలవర్చుకోవాలని డాక్టర్ ప్రమోద్‌కుమార్ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శివకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, సాఫ్ట్ నర్సు సుజాత, ఫార్మసీ ఆఫీసర్ కృష్ణ, ఏఎన్ఎం మార్తమ్మ పాల్గొన్నారు.